
ఈనాడు
ఆదివారం
21 డిసెంబరు 2025
HANUMAN
Ramayana
బాక్సాఫీస్...
పురాణ యుగం!

'ప్రేమలు' అంటూ తొలి సినిమాతోనే తెలుగు ప్రేక్షకుల మనసును దోచుకుంది మమితా బైజు. తన క్యూట్ ఎక్స్‌ప్రెషన్స్‌తో యువతలో యమా క్రేజ్ సంపాదించుకుందీ భామ. ఇటీవల వచ్చిన 'డ్యూడ్' సినిమాలోనూ తన నటనకు మంచి మార్కులే పడ్డాయి. త్వరలోనే విడుదల కానున్న 'జన నాయగన్'లో తమిళ స్టార్ విజయ్‌తో కలిసి నటించిన ఈ మలయాళ కుట్టి ముచ్చట్లివి...

నన్ను 'బేబీ డాక్టర్' అనేవాళ్లంతా..!



ఫొటో తెచ్చిన అవకాశం

మాది కేరళలోని కోట్టయం. నేను పుట్టిందీ పెరిగిందీ అంతా అక్కడే. సైకాలజీలో డిగ్రీ పూర్తి చేశా. చిన్నప్పటి నుంచీ సాంస్కృతిక కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనేదాన్ని. కూచిపూడి నృత్యంలో శిక్షణ కూడా తీసుకున్నా. ఓసారి మా స్కూల్‌లో ఇచ్చిన నృత్య ప్రదర్శనకు సంబంధించిన ఫొటోనే.. నాకు సినిమాల్లో అవకాశం తెచ్చిపెట్టింది. నాకు బాగా గుర్తు.. అప్పుడు నేను తొమ్మిదో తరగతి చదువుతున్నా. ఒకరోజు నాన్న స్నేహితుడు ఒకరు వచ్చి.. తాను నిర్మించబోయే సినిమాలో ఓ పాత్రకు నన్ను అడిగారు. మొదట కాస్త ఆలోచించినా.. చిన్న పాత్రే కావడంతో ఆయన సరేనన్నారు. అలా 2017లో 'సర్వోపరి పలక్కారన్'తో తెరంగేట్రం చేశా.

అది మాటల్లో చెప్పలేనిది

మా నాన్న బైజు కృష్ణన్ డాక్టర్ కావడంతో చిన్నప్పటి నుంచీ నేనూ ఆయన వెంట క్లినిక్‌కు వెళ్లేదాన్ని. అక్కడికి వచ్చే వారంతా నన్ను 'బేబీ డాక్టర్' అనేవాళ్లు. జబ్బు నయం అయ్యాక.. ఇంటికి వెళ్తూ రోగులు కృతజ్ఞతతో నాన్నకు ధన్యవాదాలు చెబుతుంటే, నాకు చాలా సంతోషంగా అనిపించేది. ఆ భావనను మాటల్లో చెప్పడమూ కష్టమే. అప్పుడే నేను కూడా డాక్టర్ కావాలని అనుకున్నా.

నమ్మకం నిజమైంది

కాస్త ఆలస్యమైనా.. మనకు రాసి పెట్టి ఉన్నది కచ్చితంగా దక్కి తీరుతుందని బలంగా నమ్ముతా. గతంలో సూర్య సర్‌తో కలిసి నటించే అవకాశం వచ్చింది. కొన్ని రోజులు షూటింగ్‌లోనూ పాల్గొన్నా. కానీ, అనుకోని కారణాలతో అందులోంచి నేను తప్పుకోవాల్సి వచ్చింది. ప్రస్తుతం సూర్య సర్‌తోనే మరో సినిమా చేస్తుండటంతో నా నమ్మకం నిజమైందని అనిపిస్తుంటుంది.

నా పేరు మారిందలా...

నా అసలు పేరు నమిత. కానీ, ఆసుపత్రి సిబ్బంది బర్త్ సర్టిఫికెట్‌లో పొరపాటుగా మమిత అని నమోదు చేశారు. నేను స్కూల్‌లో జాయిన్ అయ్యే వరకూ ఆ తప్పును ఇంట్లో వాళ్లెవరూ గమనించలేదు. ఆ పేరు డిఫరెంట్‌గా ఉండటంతోపాటు దానికి 'మిఠాయి' అనే అర్థమూ ఉందనీ చెప్పడంతో దాన్నే కొనసాగించా.

అల్లు అర్జున్ ఫ్యాన్‌ని...

నాకు తెలుగు సినిమాలంటే ఇష్టం. నేను చూసిన మొదటి చిత్రం 'మగధీర'. 'ఈగ' సినిమానూ చాలాసార్లు చూశా. నేను అల్లు అర్జున్‌కి పెద్ద ఫ్యాన్‌ని. ఆయన నటించిన ప్రతి సినిమానూ థియేటర్‌లో కనీసం పదిసార్లు చూసుంటా. టీవీలో వస్తే చెప్పక్కర్లేదిక.

అది నా తొలి సినిమా కాదు

చాలామంది 'ప్రేమలు' నా తొలి సినిమా అని అనుకుంటుంటారు. కానీ, అది నా పదహారవ చిత్రం. అంతకుముందే మలయాళంలో సహాయ నటిగా చాలా చిత్రాలే చేశా. సినిమా అనేది కేవలం నా కెరీర్ మాత్రమే కాదు.. అదో భావోద్వేగం. నటన పట్ల నాలో పుట్టిన ప్రేమే ప్రస్తుతం నన్ను ఈ స్థాయికి తీసుకొచ్చింది.



తనే డీల్ చేస్తుంటాడు

మా అన్నయ్య మిథున్ రాష్ట్ర స్థాయి క్రికెటర్. పేరుకి మేమిద్దరం అన్నాచెల్లెళ్లమైనా, క్లోజ్ ఫ్రెండ్స్‌లా ఉంటాం. కుటుంబం, అకడమిక్స్, కెరీర్.. ఇలా ప్రతి విషయంలోనూ తన సలహా తీసుకుంటుంటా. అంతేకాదు.. నాకు వచ్చే లవ్ ప్రపోజల్స్ కూడా తనే డీల్ చేస్తుంటాడు.

అత్యుత్తమ ప్రశంస అదే..

అగ్ర దర్శకుడు రాజమౌళి గారితో కలిసి పనిచేయాలని కోరుకోని నటీనటులు ఉండరు. అలాంటి దిగ్గజ వ్యక్తి.. అలనాటి తార గిరిజతోనూ, నా ఫేవరెట్లలో ఒకరైన సాయి పల్లవితోనూ పోలుస్తూ నన్ను ప్రశంసించడాన్ని ఎప్పటికీ మర్చిపోలేను.

అలా కరిగించేస్తా..

కేరళ స్టైల్‌లో వండే చేపల కూరను ఇష్టంగా తింటా. హైదరాబాద్‌లో అయితే పంచెకట్టు దోసె, బిర్యానీ బాగా నచ్చాయి. ఆ అదనపు కెలోరీలన్నింటినీ కూచిపూడి ప్రాక్టీస్‌తో కరిగించేస్తుంటా. రోజూ యోగా, స్కిప్పింగ్ సరేసరి.

దైవ ఫలం

భూమ్మీద ఒక చిన్నారి ఉండేవాడు.

దేవుడు అందరికీ స్వర్గంలో పళ్ళు పంచిపెడుతున్నాడని ఆ పిల్లాడికి ఒకరోజు తెలిసింది.

ఆ విషయం విని చాలా ఆనందించాడు. దేవుడి నుంచి పండు తీసుకోవడం కోసం స్వర్గానికి వెళ్ళాడు.

అక్కడ చాలా పెద్ద క్యూ ఉంది. ఆ పెద్ద వరుసలోనే నించున్నాడా చిన్నారి.

మరికాసేపట్లో తాను నేరుగా భగవంతుడి చేతుల మీదుగా బహుమతి అందుకోబోతున్నానన్న భావన ఆ చిన్నారిని ఉద్వేగంతో కుదిపేసింది. తన వంతు వచ్చినప్పుడు ఆ పిల్లవాడు పండు అందుకోవడానికి రెండు చేతులూ చాచాడు.

దేవుడా పిల్లవాడికి పండునందించాడు.

దురదృష్టవశాత్తూ అంత పెద్ద పండుని ఆ చిట్టి చేతులు నిలిపి ఉంచలేకపోయాయి. జారి మట్టిలో పడిపోయి, ఆ పండు వృథా అయిపోయింది.

చిన్న పిల్లాడు చాలా నిరాశపడ్డాడు.

మరో పండు కావాలంటే మళ్ళీ క్యూలో నిలబడాలని, దేవుడి దగ్గర ఉండే మంత్రులు ఆ పిల్లాడికి సూచించారు.

అంతసేపు ఎదురుచూసి ఉత్తచేతులతో వెళ్ళడం కంటే మరికొంతసేపు వరుసలో నించోవడమే మంచిదని అనుకున్నాడు పిల్లవాడు.

కానీ ఆ సమయానికి క్యూ ముందరికంటే చాలా పెద్దదైపోయింది. వరుసలో మళ్ళీ నించున్న చిన్నారి, దేవుడి నుంచి పండు తీసుకుని వెళుతున్న వారి ముఖాల్లోని సంతృప్తిని గమనించాడు. దేవుడిచ్చిన పండును అందరూ అంత సులువుగా తీసుకువెళుతుంటే తనకే ఎందుకలా అయిందా అని ఆ బాబు చాలా బాధపడ్డాడు.

తనొక్కడే అంతలా కష్టపడడానికి తను చేసిన పాపమేంటన్న సందేహం ఆ పిల్లాడిని క్షోభ పెట్టింది. ఈసారి ఎట్టి పరిస్థితుల్లోనూ ఆ పండుని పోగొట్టుకోకూడదనుకున్నాడు. ఎట్టకేలకు వరుసలో అతని వంతు వచ్చింది. ఈసారి దేవుడు పండునిస్తూ ప్రేమగా ఇలా అన్నాడు...

'నా ముద్దుల చిన్నారి బాబూ! ఇంతకుముందు నీకు పండు ఇస్తున్నప్పుడు అది కుళ్ళిపోయిన సంగతి అప్పుడే గమనించాను. అందుకే అది నీ చేతుల్లో నుంచి పడిపోయేలా చేశాను. ఈసారి నీకు నా తోటలోకెల్లా మంచి పండునిద్దామనుకున్నాను. కానీ అలాంటి పండు ఇంకా పెరుగుతూనే ఉంది. అందుకే నిన్ను వరుసలో ఎక్కువసేపు నిలబెట్టేశాను. ఇదిగో, ఇప్పుడు నేను నీకు ఇస్తున్న పండు తోటలో ఇప్పటివరకూ కాసిన పండ్లలోకెల్లా అత్యుత్తమమైనది. ఇది నీదే.'

(కొన్నిసార్లు మనం వంద శాతం నిబద్ధతనీ అంకితభావాన్నీ చూపినా పనులు ఆలస్యమవుతూ ఉంటాయి. లేదా అవి విఫలం కూడా కావచ్చు. అలాంటప్పుడు- అంతకంటే గొప్పదేదో మనకోసం దేవుడు అట్టే పెట్టి ఉంచాడనీ అందుకే ఆలస్యమైందనీ లేదా విఫలమైందనీ అర్థం చేసుకోవాలి.)

సేకరణ: భాస్కర్ గుప్తా

లోపల...

నేనేం అంటాను!

రాజు: మన పెళ్లయ్యాక ఇంట్లో అంతా శుభ్రంగా, అన్నీ సర్దిపెట్టి ఉండాలి. అది వాష్‌రూమ్ అయినా, కిచెన్ అయినా, హాలైనా... ఏమంటావ్?

రాణి: నేనేమంటానండీ! మీరు అన్నీ చక్కగా సర్ది పెడతానంటేనూ..!



మంచిమాట

సీతాదేవిని అపహరించడానికి రావణుడు సాధువు వేషంలో వచ్చాడు. అలాగే మనిషిని లోబరచుకోవడానికి చెడు- 'మంచి' అనే ముసుగులో వస్తుంది.

పల్లె వైద్యంలో... ఏఐ విప్లవం!

ఏఐ రోబోలు ఆపరేషన్‌లు చేస్తున్నాయనీ... మహమ్మారి వ్యాధులకి మందులు కనిపెట్టడంలో సాయపడుతున్నాయనీ వింటున్నాం కదా! అయితే 'ఈ అత్యాధునిక సాంకేతికతతో సామాన్యులకి ఒరిగేదేమిటీ...? పల్లె ప్రాంతాలవాళ్లకి కలిగే ప్రయోజనాలేమిటీ?' అన్న ప్రశ్నలు వేసుకున్నారు ఈ నిపుణులు. దాని ఫలితమేంటో చూడండి...

నిమిషాల్లోనే రక్తపరీక్షలు!



పర్భని... మహారాష్ట్రలోని ఓ చిన్నపట్టణం. అక్కడ 'ఉద్యతి' అని ఓ చిన్న రక్తపరీక్షా కేంద్రం ఉంది. ఆ కేంద్రానికి ఓ 12 ఏళ్ల చిన్నారి రక్తనమూనాలు వచ్చాయి. సాధారణ జ్వరం పరీక్షే అది... తెల్లరక్తకణాలు (డబ్ల్యూబీసీ) కొద్దిగా ఎక్కువ ఉన్నాయి. 'మామూలు వైరల్ జ్వరం కావొచ్చు' అనుకున్నాడు అక్కడి రేడియాలజిస్టు డాక్టర్ చైతన్య. కానీ ఎందుకైనా మంచిదని ఆ నమూనాని 'ఏఐ100' స్కానర్‌లో పెట్టాడు. రెండు నిమిషాల్లోనే దాన్ని విశ్లేషించి... '80 శాతం బ్లాస్ట్ సెల్స్' ఉన్నాయని చెప్పింది. దానర్థం... ఆ 12 ఏళ్ల చిన్నారికి బ్లడ్‌క్యాన్సర్ ఉందీ అని! వెంటనే ఆ రక్తనమూనాల్ని పంపిన డాక్టర్‌ని అలర్ట్ చేశాడు చైతన్య. ఆ చిన్నారిని పెద్ద ఆసుపత్రికి పంపించారు. బ్లడ్ క్యాన్సర్‌ని ముందుగా పసిగట్టడం వల్ల... ఏడాది తర్వాత ఆ చిన్నారి మృత్యుంజయుడిగా బయటకొచ్చాడు. బెంగళూరుకి చెందిన సిగ్‌ట్యూపిల్స్ సంస్థ తయారుచేసిన అత్యాధునిక 'ఏఐ100' స్కానర్‌కి సంబంధించి ఇలాంటి విజయగాథలు ఎన్నో! మన దగ్గర వీధికో వైద్యపరీక్షా కేంద్రాలున్నాయి కానీ సుశిక్షితులైన నిపుణులు తక్కువ కావడం వల్లా... వాళ్లపైన పనిఒత్తిడి వల్లా... మానవ తప్పిదాలు ఎక్కువ జరుగుతున్నాయంటారు వైద్యనిపుణులు. అలాంటి తప్పులకి అవకాశం లేకుండా... రోగి నమూనాల్ని కేవలం రెండు నిమిషాల్లోనే విశ్లేషిస్తుంది 'ఏఐ100' స్కానర్. కోల్‌కతాకి చెందిన పాతికేళ్ల సైంటిస్టు తథాగతో దస్తిదార్ దీని ఆవిష్కర్త. ఇందుకోసం 48 జాతీయ, అంతర్జాతీయ పేటెంట్‌లని సొంతం చేసుకున్నాడతను. మనదేశంలోని పాత్‌ల్యాబ్స్, థైరోకేర్ వంటి అతిపెద్ద డయాగ్నస్టిక్ సెంటర్‌లతోపాటూ, పలు మారుమూల పట్టణాలకి చెందిన రెండువేల సంస్థలు 'ఏఐ100 స్కానర్‌'ని ఉపయోగిస్తున్నాయి!

పల్లెవాసులకూ ఐసీయూ...

ఓ మామూలు నర్సింగ్‌హోమ్‌నీ పెద్ద కార్పొరేట్ ఆసుపత్రినీ వేరు చేసే ప్రధాన అంశం ఒకటుంది. అదే ఇంటెన్సివ్ కేర్ యూనిట్(ఐసీయూ). పెద్ద ప్రమాదాలూ, గుండెపోటు వంటి ప్రాణాపాయ పరిస్థితుల్లో ఉన్నవాళ్లని కాపాడే విభాగం ఇదే. ఇందులో క్రిటికల్ కేర్ నిపుణుల వ్యవస్థ ఉంటుంది. వెంటిలేటర్ సౌకర్యాలూ ఉంటాయి. పట్టణప్రాంతాల్లోని



ఆసుపత్రుల్లో అవి ఉండవు కాబట్టే... రోగుల్ని అత్యవసర పరిస్థితుల్లో నగరాలకి తీసుకెళ్లాల్సి వస్తోంది. ఆ అవసరం లేకుండా- పట్టణాల్లోని మామూలు ఆసుపత్రుల్లోనూ ఇంటెన్సివ్ కేర్



సౌకర్యాన్ని కల్పిస్తోంది 'క్లౌడ్ ఫిజీషియన్' అనే సంస్థ. ప్రతి ఆసుపత్రికీ 'రాడార్' (ర్యాపిడ్ యాక్షన్ డ్రగ్ అలర్ట్స్ అండ్ రెస్పాన్స్) అనే ఏఐ వ్యవస్థని ఏర్పాటుచేస్తుందీ స్టార్టప్. ఇందులో ఓ చిన్న వెంటిలేటర్, బీపీ తదితరాల్ని కొలిచే పరికరాలూ, రోగి శరీరాన్ని అతి సూక్ష్మంగా గమనించే అత్యాధునిక కెమెరా ఇవన్నీ భాగాలు. వీటన్నింటినీ దూరం నుంచే 'క్లౌడ్ ఫిజీషియన్'కి చెందిన క్రిటికల్ కేర్ నిపుణులు 24 గంటలూ గమనిస్తూ ఉంటారు. రోగికి ఎలాంటి చికిత్స ఇవ్వాలో ఆసుపత్రిలోని నర్స్‌లకీ, డాక్టర్‌లకీ చెబుతూ ఉంటారు. అలా తెలంగాణ సహా 17 రాష్ట్రాల్లోని 280 చిన్న ఆసుపత్రుల్లో సేవలందిస్తోంది 'క్లౌడ్ ఫిజీషియన్' సంస్థ. దీని ద్వారా సుమారు లక్షన్నరమంది రోగులకి ప్రాణాపాయం తప్పించామంటున్నారు ఆ సంస్థ వ్యవవస్థాపకులు డాక్టర్ దిలీప్ రామన్, డాక్టర్ ధ్రువ్ జోషి. ఆ రకంగా వైద్య రంగంలో ఓ సరికొత్త విధానానికి తెరతీశారు వీళ్లు.

'టైమ్స్ 100'లో...



ఆ మధ్య టైమ్స్ పత్రిక ప్రపంచంలోని అత్యంత ప్రభావిత (ఇన్‌ఫ్లూయెన్షియల్) కంపెనీల పేరుతో ఓ వంద సంస్థల జాబితాని విడుదలచేసింది. అందులో భారతదేశం నుంచి చోటుదక్కించుకున్న ఏకైక స్టార్టప్... 'క్యూర్ ఏఐ'. సుమారు 92 దేశాల్లో సేవలందిస్తోందీ కంపెనీ... వాటిల్లో ముప్పావువంతు పేద దేశాలే. ఆ ప్రాంతాల్లో టీబీ, ఊపిరితిత్తుల క్యాన్సర్, మెదడు సమస్యలు వంటివాటిని... కేవలం నిమిషంలోనే పసిగడుతోంది ఈ సంస్థ ఆవిష్కరించిన 'క్యూఎక్స్‌ఆర్' అనే ఏఐ! ముఖ్యంగా- వ్యాధి ముదిరితే తప్ప బయటపడని లంగ్ క్యాన్సర్‌ని నిమిషాల్లో పసిగట్టి ఎంతోమంది ప్రాణాలని రక్షించినందుకు ప్రపంచ ఆరోగ్య సంస్థ ప్రశంసలూ అందుకుంది. అంతేకాదు, న్యూరాలజిస్టు అందుబాటులో లేని ఏ గ్రామీణ ప్రాంతంలోనో ఎవరికైనా తలకి గాయం అయిందనుకోండి... ఒక్క సీటీ స్కాన్‌తో ఆ గాయం ప్రమాదకరమో కాదో నిమిషాల్లో తేల్చేస్తుంది. అందుకే, మనదేశంలోని 25 రాష్ట్రాల్లో- మారుమూల ప్రాంతాల్లో ఉన్న వెయ్యికిపైగా ఆసుపత్రుల్లో క్యూఎక్స్‌ఆర్ సేవల్ని వాడుతున్నారు. ఐటీ రంగంలో డేటాసైన్స్ నిపుణుడిగా సేవలందిస్తూ వచ్చిన ప్రశాంత్ వారియర్... ఆ సాంకేతికతని వైద్యరంగంలో ప్రవేశపెట్టాలన్న ఆలోచనతోనే 2017లో క్యూర్ ఏఐకి శ్రీకారం చుట్టాడు. చూస్తుండగానే ప్రపంచస్థాయి గుర్తింపుని సాధించాడు.





ఇక్కడ, విశ్వమంతా వ్యాపించినట్టు కనిపించే 108 అడుగుల శ్రీమహావిష్ణువు విరాట్‌రూపం ఆశ్చర్యపరుస్తుంది. సీతాసమేత శ్రీరామచంద్రుడు భక్తుల పాలిట కొంగుబంగారమై పూజలు అందుకుంటున్నాడు. ఆలయ నిర్మాణమూ ఎంతో ఆకట్టుకుంటుంది. ఇలా అనేక విశేషాలకు నెలవైన క్షేత్రమే కర్ణాటకలోని ఈజీపురలో ఉన్న కోదండరామస్వామి దేవస్థానం.



రామాలయంలో... విశ్వరూపం!

కోదండరామస్వామి ఆలయం.... శ్రీరాముడు మూలవిరాట్టుగా కొలువై సీత-లక్ష్మణ-ఆంజనేయ సమేతంగా పూజలు అందుకుంటున్న ఈ దేవస్థానం బెంగళూరు లోని ఈజీపురలో ఉంది. ఈ ఆలయంపైన ప్రతిష్ఠించిన శ్రీమన్నారాయణుడి విశ్వరూప శిల్పం భక్తుల్ని విశేషంగా ఆకట్టుకుంటుంది. అంబరాన్ని తాకుతున్నట్టుగా 108 అడుగుల్లో ఉండే స్వామి విరాట్‌మూర్తి దేశంలోని ఎత్తయిన దేవతా విగ్రహాలలో ఒకటిగా ప్రసిద్ధి చెందింది.

శ్రీకారం ఇలా...

ఈ ప్రాంతంలో బుచ్చప్ప అనే రామ భక్తుడు ఉండేవారు. అతను స్వాతంత్ర్యానికి పూర్వం ప్రస్తుతం ఆలయం ఉన్న స్థలాన్ని కొనుగోలు చేసి, చిన్న రామాలయాన్ని నిర్మించారు. కొన్నాళ్లకు ఆయన కుమారుడు డాక్టర్ సదానంద ఈ ఆలయాన్ని అభివృద్ధి చేయాలని సంకల్పించారు. వైద్యుడిగా తాను సంపాదించిన డబ్బునంతా ఆలయ పునర్నిర్మాణానికి కేటాయించేందుకు సిద్ధపడ్డారు. గోపురం ఎత్తు పెంచడమో, ఇతర దేవతా విగ్రహాలను ప్రతిష్ఠించడమో కాకుండా... కాస్త వినూత్నంగా ఏదైనా చేయాలని సంకల్పించారు. ఎంతో అంతర్మథనం తర్వాత, భారీ విష్ణుమూర్తి విగ్రహాన్ని ఏర్పాటు చేసేందుకు సిద్ధపడ్డారు. అందుకు అవసరమైన శిలను సేకరించడం దగ్గర నుంచి విగ్రహం తయారీ వరకూ తన ప్రయత్నానికి ఎన్నో సవాళ్లు ఎదురైనట్టు చెబుతారు డాక్టర్ సదానంద. 'మేము బెంగళూరులో స్థిరపడిన తెలుగువాళ్లం. ప్రభుత్వ వైద్యుడిగా ఉద్యోగ విరమణ చేశాక, ఆలయ అభివృద్ధిపైన దృష్టిపెట్టాను. అనుకున్నది అనుకున్నట్టు విగ్రహాన్ని తయారు చేయించి, వేదోక్తంగా ఆవిష్కరించేందుకు చాలా సంవత్సరాలు పట్టింది. ఎంతో అన్వేషణ తర్వాత, తమిళనాడు తిరువణ్ణామలై శివారులో తారసపడిన కృష్ణశిలను విష్ణుమూర్తి విగ్రహం కోసం ఎంచుకున్నాం. ఆ శిల బరువు దాదాపు 300 టన్నులు కావడంతో, ప్రభుత్వ అనుమతి అవసరమైంది. అప్పటి తమిళనాడు ముఖ్యమంత్రి జయలలిత సానుకూలంగా స్పందించినా... భారీ వాహనంలో ఎన్నో చెక్‌పోస్టులను దాటుకుని ఇక్కడి వరకూ తీసుకువచ్చే క్రమంలో కొందరు అభ్యంతరం చెప్పారు. ఆ కష్టనష్టాలను భరిస్తూనే ఆ శిలను గమ్యానికి చేర్చాం. వ్యయ ప్రయాసలకు ఓర్చి విగ్రహం తయారీకి సిద్ధపడ్డాం. దాదాపు 120 మంది కళాకారులు అయిదారేళ్లపాటూ శ్రమించి విశ్వరూప మూర్తికి ప్రాణం పోశారు' అని వివరిస్తారు డాక్టర్ సదానంద.



శివకేశవ రూపంతో...



ఆలయంపైన 108 అడుగుల ఎత్తులో కనిపించే విశ్వరూప విగ్రహం అనేక విశేషాల సమాహారం. శివకేశవులు ఒక్కటేనని చాటేలా తయారు చేసిన విగ్రహంలో... ఏడుపడగల ఆదిశేషుడి నీడన తిరునామంతో దర్శనమిచ్చే స్వామి రూపం, అక్కడక్కడా కనిపించే పసిడి కాంతులూ అబ్బురపరుస్తాయి. అంతేనా... కూర్మపీఠం, అష్టదిక్పాలకులు, నవగ్రహాలు, దశావతారాలు, త్రిమూర్తులు, అమ్మవార్లు, ఆయుధాలు, ఊర్ధ్వలోకాలు, సముద్రాలు... ఇలా అనంత ప్రకృతితోపాటు సమస్త దేవతాగణ సమేతంగా దర్శనమిచ్చే స్వామి తేజో స్వరూపాన్ని చూసేందుకు రెండుకళ్లూ చాలవు. అందుకే ఇది దేశంలోనే ఎత్తయిన, అరుదైన విగ్రహాల్లో ఒకటిగా ప్రసిద్ధి చెందింది. ఇక్కడికి వచ్చే భక్తులు ముందుగా గర్భాలయంలో కొలువైన ఆంజనేయ, లక్ష్మణ సమేత సీతారామచంద్రుల్ని దర్శించుకుని... ఆ తర్వాత మెట్లెక్కి విశ్వరూప సందర్శనానికి వెళ్తారు. ఆంజనేయుడు ఈ ఆలయ క్షేత్రపాలకుడు. వినాయకుడు, స్ఫటిక శివలింగం, వరాహస్వామి... వంటి దేవతామూర్తుల్నీ పూజించుకోవచ్చు. అలాగే చైత్ర, శ్రావణ, ఆశ్వయుజ, కార్తిక, ధనుర్మాసాల్లో వచ్చే ప్రత్యేక సందర్భాలూ, పండుగల్లో జరిపే ఉత్సవాలూ, నిర్వహించే సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొనేందుకు కర్ణాటక, తమిళనాడు నుంచీ భక్తులు తరలివస్తారని చెబుతారు నిర్వాహకులు.

ఇలా చేరుకోవచ్చు...

బెంగళూరు రైల్వేస్టేషన్ నుంచి దాదాపు పది కిలోమీటర్ల దూరంలో ఉండే ఈ ఆలయాన్ని చేరుకునేందుకు ఆటోలూ, బస్సులూ, మెట్రోరైలూ అందుబాటులో ఉంటాయి. బెంగళూరు అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి దాదాపు గంట ప్రయాణం. ఈ క్షేత్ర సందర్శనం భక్తులకు చక్కని ఆధ్యాత్మిక అనుభూతిని కలిగిస్తుంది. ★



చిట్టి... చిట్టి... లైబ్రరీలు!






ఓ చిన్న అల్మరాలాంటి చెక్క పెట్టెలవి... మైసూరు నగరంలోని ప్రధాన కేంద్రాల్లో ఈ మధ్యే కనిపిస్తున్నాయి. అందమైన అలంకరణలతో ఉన్న ఆ పెట్టెల్లో ఏముందా అని చూస్తే... చక్కగా పేర్చిన పుస్తకాలు కనిపిస్తాయి. అలనాటి క్లాసిక్స్ నుంచీ సరికొత్త బెస్ట్‌సెల్లర్స్ దాకా సుమారు 30-35 గ్రంథాలుంటాయి. ఆ పుస్తకాల్లో ఒకదాన్ని - ఆ పక్కనే ఉన్న నిర్వాహకులకి ఓ మాట చెప్పి చక్కగా ఇంటికి తీసుకెళ్లిపోవచ్చు. అది బాగా నచ్చితే... మన దగ్గరే ఉంచుకోవచ్చు. 'మరీ ఉచితంగా ఎలా తీసుకుంటాం' అనిపిస్తే మీ దగ్గర ఉన్న ఇంకేదైనా పుస్తకాన్ని తెచ్చి అందులో పెట్టొచ్చు. మైసూరు నగరానికి చెందిన టాస్క్ ఎడ్యుకేషనల్ ఛారిటబుల్ అండ్ వెల్ఫేర్ ట్రస్టు 'లిటిల్ ఫ్రీ లైబ్రరీస్' పేరుతో ఈ బాక్సుల్ని అక్కడ పలుచోట్ల ఏర్పాటుచేసింది. సుమారు ఐదొందల పుస్తకాలని అలా ఈ బుల్లి లైబ్రరీల్లో పెట్టింది. సదా మొబైళ్లకి అతుక్కుపోతున్న పిల్లల్నీ టీనేజర్లనీ పుస్తకపఠనం వైపు నడిపించాలన్నదే 'టాస్క్' సంస్థ లక్ష్యమని వేరే చెప్పాలా!

కన్నయ్యని మనువాడింది...

అంగరంగ వైభవంగా జరిగిన పెళ్లి అది. అక్షరాలా ఆకాశమంత పందిరే వేశారు. ఆ ఊరు ఎన్నడూ చూడని స్థాయిలో విందు భోజనం ఏర్పాటుచేశారు. ఉత్తర్‌ప్రదేశ్ బదాయూ జిల్లాలోని కసిమాబాద్ గ్రామానికి చెందిన 28 ఏళ్ల పింకీ శర్మ కల్యాణ వేడుక అది. ముహూర్తానికి గంట ముందు... వరుడి ఇంటి నుంచి ఓ కారు వచ్చింది. పింకీ శర్మ మేనత్త కొడుకు సూటూబూటుతో అందులో నుంచి దిగాడు. కాకపోతే పెళ్లికొడుకు అతను కాదు... అతని చేతిలో చిరుదరహాసాన్ని చిందిస్తూ వచ్చిన... కాంస్య విగ్రహరూపుడైన శ్రీకృష్ణుడు! ఔను పింకీ శర్మ ఆ కన్నయ్యనే పెళ్లాడింది ఆ రోజు. ముహూర్తం వేళ కృష్ణుడి చేతి నుంచి మంగళ సూత్రాన్ని తీసుకున్న పింకీ... దాన్ని తన మెడలో వేసుకుంది. కృష్ణుడి విగ్రహాన్ని చంకన పెట్టుకుని ఏడడుగులు నడిచింది. పింకీ శర్మ పీజీ చదివిన అమ్మాయి... చిన్నప్పటి నుంచీ కృష్ణ భక్తురాలు. మీరా బాయిలా తనది మధుర భక్తని చెబుతుండేది. ఆ మధ్య మధురలోని శ్రీకృష్ణ ఆలయానికి వెళితే ఆమెకి వచ్చిన ప్రసాదంలో ఓ బంగారు ఉంగరం ఉందట. అది కన్నయ్య తనని పెళ్లాడటానికి పంపిన సంకేతంగా భావించింది. తల్లిదండ్రులనే కాదు... తనని పెళ్లాడాలనుకున్న మేనత్త కొడుకునీ ఒప్పించి... ఇలా కన్నయ్యని తనవాణ్ని చేసుకుంది!

అవీ ఇవీ

కడలి తల్లి గర్భంలో...





టొకునోషిమా... జపాన్‌లోని అతిపెద్ద ద్వీపాల్లో ఒకటి. నిండైన ఆరోగ్యానికీ, దీర్ఘాయుష్షుకీ ప్రసిద్ధి చెందిన ప్రాంతం ఇది... అక్కడి ప్రజల సగటు ఆయుర్దాయం 105 ఏళ్లకి పైమాటే! ఇటీవలి కాలంలో అక్కడి యువత నగర జీవనంపైన మోజుపడి ఈ ద్వీపాన్ని వదిలి వెళుతున్నారట. అలాంటివాళ్లకి- ప్రకృతికి దగ్గరగా కడలికి చేరువగా ఉండటం ఎంత గొప్ప విషయమో చెప్పేలా సముద్రం అడుగున ఇటీవల ఓ విగ్రహాన్ని ఏర్పాటుచేసింది జపాన్ ప్రభుత్వం! జపాన్‌లో ఇదే తొలి సముద్రగర్భ శిల్పమట. ఈ విగ్రహం పేరు 'ఓషన్ గయా'... కడలి తల్లి అని దాని అర్థం. సముద్రానికీ సమస్త జీవరాశికీ మధ్య ఉన్న తల్లి- బిడ్డలాంటి అనుబంధాన్ని ప్రతీకాత్మకంగా ఇందులో చూపించారు. 45 టన్నుల బరువూ ఐదుమీటర్ల వెడల్పూ ఉన్న ఈ విగ్రహాన్ని పూర్తిగా పర్యావరణహిత వస్తువులతో నిర్మించారు. చిన్నచిన్న సముద్ర జీవులు లోపలికి వెళ్ళి రాగలిగేలా చిన్న రంధ్రాలతో దీన్ని రూపుదిద్దారు. అందంగా విచ్చుకున్న పూరేకుల్లాంటి ఆకారంపైన... కాసేపు సేదతీరాలన్నట్టు మేనువాల్చిన... ఓ గర్భిణి విగ్రహం ఇది. దీన్ని చూడటానికి స్థానిక యువతే కాదు... ప్రపంచం నలుమూలల నుంచీ పర్యటకులు వస్తున్నారట!

విద్యార్థులు కట్టిన పోస్టాఫీస్!

ఇండియా పోస్ట్ సంస్థ ఈ మధ్య 'జెన్ జీ' పోస్టాఫీసుల్ని ఏర్పాటుచేస్తోంది... దేశంలోని పలు వర్సిటీ, కాలేజీ క్యాంపస్‌లలో వాటిని నెలకొల్పుతోంది. కేరళ కొట్టయంలోని సీఎంఎస్ కాలేజీలోనూ అలాంటి పోస్టాఫీస్ ఒకటి ఈ మధ్య ప్రారంభమైంది కానీ... దీనికి ప్రత్యేకతలు చాలానే ఉన్నాయి. మిగతావాటిల్లా కాకుండా... దీన్ని ఇక్కడి కాలేజీ విద్యార్థులే డిజైన్ చేశారు. అందరూ తలోచేయివేసి నిర్మాణం చేపట్టారు. అంతేకాదు, పోస్టాఫీసు ఇంటీరియర్స్‌ని కూడా కేరళ- కొట్టయం స్థానిక సంస్కృతిని ప్రతిబింబించేలా వాళ్లే బొమ్మలు గీసి అలంకరించారు. ప్రతి మూలలోనూ వర్టికల్ గార్డెన్స్‌ని పెంచారు. ఈ జెన్ జీ పోస్టాఫీసులో మామూలు తపాలా కార్యాలయానికి సంబంధించిన అన్ని సేవలూ ఉంటాయి. దాంతోపాటూ విద్యార్థుల పిచ్చాపాటి కోసం ఓ కెఫె, వాళ్ల కాలక్షేపం కోసమని గేమ్ జోన్ వంటివీ ఏర్పాటుచేశారు.







రూపాయికే భోజనం!

సికింద్రాబాద్ జంక్షన్... దేశం నలుమూలల నుంచి వచ్చే రైళ్లకే కాదు మారుమూల ప్రాంతాల నుంచి వచ్చిచేరే కష్టజీవులకూ గమ్యస్థానం! అలా కొత్తగా వచ్చినవాళ్లని అక్కడి రద్దీ రణగొణధ్వనీ గందరగోళ పరుస్తాయి. ఆ గందరగోళానికి ఆకలి కూడా తోడైతే తెలియని ఆందోళన ఏదో చుట్టుముట్టేస్తుంది. అలాంటి ఆందోళనతో వెళ్లినవాళ్లకి ఆత్మీయంగా అన్నం వడ్డిస్తుంది 'కరుణాస్ కిచెన్'! రూపాయికే టీతోపాటూ టిఫినూ లేదా భోజనమూ శుచిగా రుచిగా అందిస్తోంది!



అగ్గిపెట్టె, చిట్టి చాక్లెట్టు, బబుల్ గమ్... ఇలా రూపాయికి దొరికే వస్తువుల్ని వేళ్లమీద లెక్కపెట్టేయొచ్చు ఈ రోజుల్లో. అసలు డిజిటల్ పేమెంట్లు పెరిగాక రూపాయిని చూడటమే అరుదైంది. అలాంటిది... ఒక్క రూపాయికే టిఫిన్‌తోపాటూ టీ కూడా ఇస్తున్నారు 'కరుణాస్ కిచెన్'లో. ఉప్మా, పులిహోర, గుడ్డుతోపాటూ అరటి పళ్లు, రాగిమాల్ట్, రాగి సంగటి... ఇలా రోజుకో రకం టిఫిన్ పెడతారు! ఇంట్లో చేసినంత శుచిగా అందిస్తారు. ఏ ఆహారమైనా కనీస పోషకాలు ఉండేలా చూస్తున్నారు. స్టీల్ ప్లేట్లలోనే వడ్డిస్తారు... స్వచ్ఛమైన తాగునీరే ఇస్తారు. మధ్యాహ్న భోజనమూ అంతే. వారంలో ఒకరోజు అన్నం- దోసకాయ పప్పూ, ఇంకోరోజు అన్నం- సాంబారు, మరొకరోజు కిచిడీ లేదా టొమాటో రైస్ వంటివి పెడతారు. ప్రతిదీ వేడిగా పెట్టాలన్న నియమం వీళ్లది. అలా రోజుకి ఆరువందల మందికి రూపాయికే ఆహారాన్ని అందిస్తోంది 'కరుణాస్ కిచెన్'. రెజిమెంటల్ బజార్ రోడ్డులో పాత మనోహర్ థియేటర్ పక్కన ఉన్న ఈ హోటల్‌కి... సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ నుంచి నడిచి వెళ్లినా ఐదు నిమిషాల్లో చేరుకోవచ్చు. ఈ కరుణాస్ కిచెన్ సంస్థని జార్జి రాకేశ్ బాబు నడుపుతున్నాడు. తమ 'గుడ్ సమరిటన్స్ ఇండియా' అనే స్వచ్ఛంద సంస్థ ద్వారా దీన్ని నిర్వహిస్తున్నాడు. నిజానికి రాకేశ్ సేవాప్రస్థానం ఇప్పటిది కాదు, రెండు దశాబ్దాలుగా సాగుతోంది. మానవతాస్ఫూర్తికి సజీవ సాక్ష్యమది.



చిప్స్ అమ్మి ఆకలి తీర్చాడు...

రాకేశ్ బాబు పుట్టింది హైదరాబాద్‌లో. ఏడో తరగతి చదువుతున్నప్పుడే ఆయన తండ్రి చనిపోవడంతో... తల్లి ఒంటరిగానే నలుగురు పిల్లల్ని పెంచి పెద్ద చేసిందట. డాక్టర్ కావాలని ఆశపడ్డ రాకేశ్... తల్లి పడుతున్న ఇబ్బందులు చూసి మామూలు డిగ్రీయే చదివాడు. ఈవెంట్ మేనేజ్‌మెంటులో డిప్లొమా ముగించి... పెద్ద కార్పొరేట్ సంస్థల్లో పనిచేశాడు. కానీ అది సంతృప్తి ఇవ్వక... డాక్టర్‌గా సేవ చేయాలన్న ఆశ చావక... 2005లో ఆర్‌ఎంపీగా శిక్షణ తీసుకున్నాడట. అలా హైదరాబాద్ శివారులోని మచ్చబొల్లారంలో ఉచిత క్లినిక్ ఏర్పాటుచేశాడు. వృద్ధులనైతే అవసరాన్నిబట్టి రెండుమూడురోజులు ఆ క్లినిక్‌లోనే ఉంచి చూసుకునేవాడట. అలా ఓసారి విజయలక్ష్మి అనే వృద్ధురాల్ని తీసుకొచ్చి మళ్లీ వస్తామని వెళ్లిపోయారట ఆమె కొడుకులు. రెండు మూడురోజుల్లో ఆమె కోలుకుంది కానీ... వాళ్లు మాత్రం పత్తాలేకుండా పోయారట. దాంతో విజయలక్ష్మిని తమ దగ్గరే ఉంచుకున్నారు రాకేశ్ దంపతులు. అంతేకాదు... ఏడాదిలోనే అలాంటి 'అనాథ' వృద్ధులు 11 మంది అక్కడికి వచ్చి చేరారట! 'నా భార్య సునీత స్పెషల్ ఎడ్యుకేటర్‌గా పనిచేస్తుండేది. తనకి వచ్చే జీతం తప్ప వేరే ఆదాయం లేదు. ఒక్కోరోజు వృద్ధులకి ఇంత అన్నం పెట్టాలన్నా ఇబ్బందయ్యేది. ఎదుటివాళ్ల ఆకలి నన్ను నిలువునా దహించిన తొలి సందర్భం అదే' అంటాడు రాకేశ్! ఆ వృద్ధులకి అన్నం పెట్టడం కోసమే సికింద్రాబాద్‌లో చిప్స్ అమ్మసాగాడు. అతని కష్టాన్నీ నిజాయతినీ చూసీ దాతలు కొందరు విరాళాలు ఇవ్వడం మొదలుపెట్టారట. వాళ్ల దన్నుతోనే 'గుడ్ సమరిటన్స్ ఇండియా' ఎన్జీఓని ప్రారంభించాడు రాకేశ్. తెలంగాణలో నాలుగుచోట్ల ఆశ్రమాల్ని నెలకొల్పాడు. సుమారు 250 మందికి ఆశ్రయం కల్పించాడు... కానీ ఆ సేవావృక్షాన్ని కరోనా నిలువునా కూల్చేసిందట!

అన్నదానానికే...

కరోనా లాక్‌డౌన్ కాలంలో ఆశ్రమాల కోసమని భవనాలు అద్దెకిచ్చినవాళ్లు 'ఈ ముసలివాళ్ల వల్ల కరోనా పెరుగుతుంద'ని భయపడి ఖాళీ చేయమని ఒత్తిడి తెచ్చారట. మరోవైపు అనాథ వృద్ధులు చనిపోతే... అంత్యక్రియలు చేయడం కూడా కష్టంగా మారిందట. దాంతో ఆశ్రమాల్ని మూసేసి... అందులోని వృద్ధుల్ని వేరే పెద్ద సంస్థలకి అప్పగించాడట రాకేశ్. ఆ విషాదం నుంచి బయటపడటానికే గాంధీ ఆసుపత్రి, సికింద్రాబాద్ క్లాక్‌టవర్‌ల వద్ద అన్నదానం చేయడం మొదలుపెట్టినట్లు చెబుతాడాయన. అలా మూడేళ్లు చేశాకే రాకేశ్‌కి 'కరుణాస్ కిచెన్' ఆలోచన వచ్చిందట. 'ఎంత ఆకలిగా ఉన్నా సరే... ఉచితం అంటే నామోషీగా భావించడం చూశాను. అలా ఉండకూడదనే రూపాయి ధర నిర్ణయించాను' అంటాడు రాకేశ్.

'కరుణాస్ కిచెన్'కి మొదట్లో వలస కార్మికులే ఎక్కువగా వచ్చేవాళ్లు. క్రమంగా ఆటోవాలాలూ, క్యాబ్‌డ్రైవర్లూ రాసాగారు. ఇప్పుడైతే చిన్న ఉద్యోగులూ చిరువ్యాపారులూ సైతం ఏ భేషజాలూ లేకుండా వస్తున్నారు. రావడమే కాదు... పుట్టినరోజులూ శుభకార్యాలకు భోజనాలని స్పాన్సర్ చేస్తున్నారు! ★



పిల్లల కోసం... టెరారియం లైట్లు!



పిల్లలకో యాక్టివిటీలా ఉండే క్రాఫ్ట్స్ టాయ్స్ ఈమధ్య చాలానే వస్తున్నాయి. ఇక్కడున్న 'లైటప్ టెరారియం కిట్స్' కూడా అలా వచ్చినవే. ఇంటీరియర్ అలంకరణలో భాగంగా గాజు తొట్టెల్లో- మొక్కలూ, రాళ్లూ, బొమ్మలూ, ఇసుకా... వంటివన్నీ జత చేస్తూ తయారు చేసే టెరారియం ఇప్పుడు పిల్లల కోసమే ప్రత్యేకంగా దొరుకుతోంది. డైనోసార్, మెర్మేడ్, యూనికార్న్... ఇలా ఎన్నో బొమ్మలూ, రంగు రంగుల ఇసుకా, క్లే, మెరిసే రాళ్లతో ఓ అందమైన బుల్లి ప్రపంచాన్ని సృష్టిస్తాయి ఈ కిట్స్. పిల్లలు వాటిని అమర్చుతూ టెరారియాన్ని తయారు చేయొచ్చు. ఛార్జింగ్ కేబుల్‌తో వచ్చే ఈ కిట్స్‌లో లైట్లు కూడా ఉంటాయి. ఎంచక్కా ఈ టెరారియాన్నే చిన్నారులు రాత్రిపూట లైట్లలానూ వాడుకోవచ్చు. కావాలంటే ఆ లైట్ల రంగుల్నీ మార్చుకుంటూ సరదాగా ఆడుకోవచ్చు.





స్మార్ట్ అగ్గిపుల్ల!



కొంతమంది గృహిణులు- తమ అభిరుచిని ప్రతిదాంట్లోనూ చూపాలనుకుంటూ మార్కెట్లోకి వచ్చే కొత్త కొత్త వస్తువుల్ని కొంటుంటారు. అలాంటి వారికోసం వచ్చిందే ఇక్కడున్న 'మ్యాచ్‌స్టిక్ షేప్ లైటర్' కూడా. వెలిగించడానికి ఉపయోగించే అగ్గిపుల్ల ఆకారంలోనే ఈ లైటర్‌ను తయారుచేశారు. పాత పద్ధతికే కొత్తదనాన్ని అద్దినట్టు భలేగా ఉంది కదూ. చూసినవాళ్లూ 'అరె, అగ్గిపుల్ల లైటర్ తమాషాగా ఉందే' అంటూ ఆశ్చర్యపోతూ చేతుల్లోకి తీసుకుంటారు!

మౌస్‌లో బొమ్మ!




అక్వేరియంలో ఉండాల్సిన రంగురంగుల చేపలూ, మంచులో ఆడుకునే పెంగ్విన్లూ, పిల్లలు ఆడుకునే బుజ్జిబుజ్జి టెడ్డీబేర్లూ... మన కంప్యూటర్ మౌస్‌లో చేరి అటూఇటూ తిరుగుతూ సందడి చేస్తుంటే ఎలా ఉంటుంది? భలే ఉంటుంది... కానీ, అదెలా సాధ్యం అంటారా. కొత్తగా వస్తున్న 'ఆక్వాథీమ్ కంప్యూటర్ మౌస్'లతో సాధ్యమే. ఎప్పుడూ ఒకేరకం నల్లటి మౌస్‌లని చూసీ, చూసీ విసిగిపోయిన వారికి ఈ ఆక్వామౌస్‌లు కొత్త ఉత్సాహాన్నిస్తాయంటే నమ్మండి. మౌస్‌కింది భాగంలో ప్రత్యేకమైన లిక్విడ్‌ని నింపి అందులో రంగురంగుల బొమ్మలని ఉంచుతున్నారు తయారీదారులు. మనం మౌస్ వాడినప్పుడల్లా అవి అటూఇటూ కదులుతుంటే- చేస్తున్న పనిలో ఉత్సాహం రాకుండా ఉంటుందా... మీరే చెప్పండి!



చెప్పుల షాపింగ్ ఇక సులువు!



ఒంటరిగా షాపింగ్‌కు వెళ్లినప్పుడు కూడా, దుస్తుల్లాంటి వాటిని నిమిషాల్లో కొనేసుకోవచ్చు. కానీ, చెప్పుల విషయంలో మాత్రం ఓపట్టాన నిర్ణయం తీసుకోలేం. ప్రత్యేకించి, పాదం సైజును కచ్చితంగా బేరీజు వేయడం అంత సులభం కాదు. ఎదిగే పిల్లల విషయంలో అయితే మరింత కష్టం. ఎవరి కోసమో మనమే చెప్పులు కొనాల్సి వచ్చినా, మన కోసమే ఆన్‌లైన్‌లో ఆర్డర్ పెట్టుకున్నా కూడా ఇలాంటి ఇబ్బందే ఎదురవుతుంది. ఈ సమస్యకు 'ఫుట్ మెజరింగ్ డివైజ్'తో పరిష్కారం లభించింది. ఈ చిన్న పరికరంతో పాదాల సైజును ముందుగానే నిర్ధారించుకుని, ఎంచక్కా షాపింగ్ చేయొచ్చు. దీంతో, ఆన్‌లైన్ ఫిటింగ్ సరిపోలేదని వెనక్కి పంపాల్సిన ఇబ్బంది ఉండదు. కొన్ని సందర్భాల్లో ఇంట్లోవాళ్లకు ఇష్టమైన స్పోర్ట్స్ షూ, పార్టీవేర్ ఫుట్‌వేర్ లాంటివి కొనేసి సర్‌ప్రైజ్ చేయాలన్నా.. ఈ డివైజ్‌ని వాడుకోవచ్చు, ఏమంటారూ?



ఇది టీతర్ గ్లౌజ్!


పళ్లు వచ్చే ముందు పసిపిల్లలు చేతికి దొరికిందల్లా నోట్లో పెట్టుకుంటారు. చిగుళ్లతో కొరికేందుకు ప్రయత్నిస్తారు. ఈ సమస్యకు పరిష్కారంగా మార్కెట్లో చాలా రకాల 'టీతింగ్ టాయ్స్' వచ్చాయి. అయితే, ఆ బొమ్మల్ని నేల మీద పడేశాక కూడా, మళ్లీ తీసి నోట్లో పెట్టుకుంటూ ఉంటారు వాళ్లు. దీంతో, బుజ్జాయిలకు ఎక్కడ ఇన్ఫెక్షన్లు వస్తాయోనని కన్నవాళ్లు భయపడి పోతారు. 'బేబీ సిలికాన్ టీతింగ్ గ్లౌజెస్'తో ఆ ఇబ్బంది ఉండదు. పిల్లల చేతికి తొడిగిన గ్లౌజులకే చివరన సిలికాన్ టీతర్స్ ఉంటాయి. పిల్లలు నోట్లో పెట్టుకోవడానికి అవి అనువుగానూ ఉంటాయి. అంటే, అటు గ్లౌజులానూ ఇటు టీతర్‌గానూ పనిచేస్తాయి అన్నమాట.


















వాల్మీకి మహర్షి సినీ రచయితగా అవతరిస్తున్నారు. వ్యాసులవారు స్క్రీన్ ప్లేలో సహకరిస్తున్నారు. అష్టాదశ పురాణాలు వెండితెరకు వైవిధ్యమైన పాత్రలను అందిస్తున్నాయి. 'ధర్మ సంస్థాపనార్థం...' సంభవించే పరమాత్మ, తన నిబంధనను తానే పక్కన పెట్టి, తెలుగు సినిమా కోసం ఓ మెట్టు దిగొచ్చి మరీ కెమెరా ముందు ప్రత్యక్షం అవుతున్నాడు. నిజంగానే ఇది టాలీవుడ్‌కు 'పురాణ యుగం'!

బాక్సాఫీస్... పురాణ యుగం!

ఓం నమస్తే రుద్రమన్యవ
ఉతోత ఇషవే నమః
నమస్తే అస్తు ధన్వనే
బాహుభ్యాముత తే నమః

...ప్రమథగణాలు 'రుద్రప్రశ్న'తో పరమేశ్వరుడిని ప్రసన్నం చేసుకునే రోమాంచిత ఘట్టంలో మనమూ భాగం అవుతాం.

కిరీటినం గదినం చక్రిణం చ
తేజోరాశిం సర్వతో దీప్తిమంతమ్...

...అలనాడు కురుక్షేత్ర సంగ్రామంలో అర్జునుడు దివ్యనేత్రాలతో దర్శించుకున్న విరాట్ రూపాన్నే మనమూ అబ్బురంగా తిలకిస్తాం.

ఉగ్రం వీరం మహావిష్ణుం
జ్వలంతం సర్వతోముఖం
నృసింహం భీషణం భద్రం
మృత్యుమృత్యుం నమామ్యహం

వజ్ర దంతాలతో ఉగ్రనరసింహుడు హిరణ్య కశిపుడి పాపాల పొట్టను చీల్చిచెండాడే సంఘటనను ప్రహ్లాద బాలుడిలా మనమూ కళ్లప్పగించి చూస్తాం.

... అలా అని, అది వైష్ణవాలయమో శైవక్షేత్రమో కాదు. సాక్షాత్తూ సినిమా థియేటర్. తెర మీద కనిపించే ఆ పురాణ దృశ్యాలు తెలుగు దర్శకుల సృజనాత్మక ఆవిష్కరణలు. దేవతల పాత్రలూ, ఇతిహాస మూలాలూ టాలీవుడ్ సక్సెస్ ఫార్ములాలుగా మారిపోయాక... బాక్సాఫీసులు నిజంగానే 'స్పెషల్ దర్శనం' టోకెన్ కౌంటర్లను తలపిస్తున్నాయి. సినిమా సూపర్‌హిట్ కావాలంటే... దేవుడి ఆశీస్సుల సంగతేమో కానీ, దేవుడి పాత్ర మాత్రం ఉండితీరాలన్న నిర్ణయానికి వచ్చేసింది పరిశ్రమ. తెలుగు తెరకు సంబంధించినంత వరకూ ఇప్పుడు 'పురాణ యుగం' నడుస్తోంది. అయినా, ఏ సాంకేతికతా లేని రోజుల్లోనే మనం... ప్రేక్షకులను 'మాయాబజార్'కు తీసుకెళ్లాం. అంతర్జాతీయ చలనచిత్రోత్సవాల్లో 'సీతాకల్యాణం' జరిపించాం. ఫిల్మ్ స్టూడియోలో 'భూకైలాస్'ను సృష్టించాం. మూడున్నర గంటల్లోనే 'సంపూర్ణ రామాయణం' చూపించాం. అలనాటి సినీ దిగ్గజాలు ఏ పురాణాన్నీ వదిలిపెట్టలేదు. 'ద్రౌపదీ వస్త్రాపహరణం', 'లంకాదహనం', 'శ్రీకృష్ణ లీలలు', 'శ్రీకృష్ణ తులాభారం', 'వీరాభిమన్యు', 'లవకుశ'... అన్నీ రామాయణ-భారత-భాగవతాలకు అందమైన తెర రూపాలే. తొలి తెలుగు టాకీ చిత్రం 'భక్త ప్రహ్లాద' భాగవతంలోని నరసింహావతారంతో ముడిపడిన ఘట్టమే. పురాణ పురుషుడు ఎన్టీఆర్ హయాం తర్వాత కూడా అడపాదడపా పౌరాణికాలు వచ్చినా, అనేకానేక కారణాలతో దర్శకనిర్మాతలు అటువైపు పెద్దగా ఆసక్తి చూపలేదు. కుటుంబ కథలు, ప్రేమ కథలు, యాక్షన్ కథలు, మాస్ కథలు, మసాలా కథలు... అంటూ కాలానికి తగ్గట్టు కొత్త పుంతలు తొక్కింది తెలుగు సినిమా. సుదీర్ఘ విరామం తర్వాత, మళ్లీ ఇప్పుడు 'పురాణం.02' ట్రెండ్ మొదలైంది.

ఎందుకింత 'భక్తి?'

తెలుగు సినిమా 'నీవే తప్ప ఇతః పరంబెరుగ... రావే ఈశ్వర, కావవే వరద, సంరక్షింపు భద్రాత్మకా' అంటూ గజేంద్రుడిలా దేవుడిని శరణువేడటం వెనుక బలమైన కారణమే ఉంది. మొదట్నుంచీ టాలీవుడ్ మూవీలకు కథానాయకుడే ప్రాణం. ఎంట్రీ సీన్ మొదలు క్లైమాక్స్ ఫైట్ వరకూ మొత్తం అతని చుట్టే తిరుగుతుంది. అందులోనూ గత దశాబ్దాల్లో కమర్షియల్ డైరెక్టర్లు... హీరోకు బీభత్సమైన ఎలివేషన్ ఇచ్చి పడేశారు. అతను కళ్లెర్రజేస్తే రైళ్లు ఆగిపోతాయి, మీసాలు మెలేస్తే బాంబులు పేలిపోతాయి, తొడగొడితే భూకంపాలు వచ్చేస్తాయి, కత్తిపడితే వంద కుత్తుకలు తెగిపడతాయి. అలా అలా హీరోయిజం పతాకస్థాయికి వెళ్లిపోయింది. ఇంతకు మించిన విన్యాసాలు చేయించాలంటే... కథానాయకుడు మానవమాత్రుడు కాకూడదు. సాక్షాత్తూ దేవుడో, దైవాంశ సంభూతుడో అయి తీరాలి. అదే జరుగుతోందిప్పుడు. దేవుళ్ళతో ముడిపెడితే ఇతివృత్తం కోసమూ తడుముకోవాల్సిన పనుండదు. మనవైన అష్టాదశ సంపదలు ఉండనే ఉన్నాయి. ఇక 'స్క్రీన్ ప్లే' అంటారా, వ్యాస వాల్మీకుల శైలిలోనే ఆ టెక్నిక్ అంతర్లీనం. కరుణ, రౌద్ర, వీర, భయానకాది రసాలైతే... పిండుకున్నవారికి పిండుకున్నంత! అవతల ఉన్నది కుర్ర దర్శకుడైనా సరే... ఆ స్టోరీ లైన్ వినగానే బడా నిర్మాతలూ ఓకే చెప్పేస్తారు. తారలకైతే అదో జీవితకాల అవకాశం. హీరో కోదండాన్ని సంధించినట్టో, నెమలి పింఛాన్ని ధరించినట్టో ఓ ఏఐ ఇమేజ్‌ను సోషల్ మీడియాలో వదిలేస్తే చాలు. పైసా ఖర్చు లేకుండా ప్రచారం హోరెత్తిపోతుంది. ముహూర్తం షాట్‌కు ముందే ముంబయి వర్గాలూ మూగిపోతాయి.



'పాన్ ఇండియా' స్థాయి వచ్చేసినట్టే. శుభం!

తరాల సంపదలు...

భారతీయుల దృష్టిలో పురాణాలు కథలో కల్పనలో కాదు. వేదాల సారాలు, ఉపనిషత్తుల భాష్యాలు. రామాయణం ఏడువేల ఏళ్ల నాటిదని అంటారు. భారతం ఐదువేల సంవత్సరాలకు పూర్వం జరిగిందని చెబుతారు. అంతకు ప్రాచీనమైనవీ కావచ్చు. కాలక్రమంలో ఉపకథలూ, ఉపమానాలూ వచ్చి చేరినా.. మూలంలోని చిక్కదనం చెక్కుచెదరలేదు. ఎన్నిసార్లు చదివినా, ఎన్నిసార్లు విన్నా, ఎన్నిసార్లు తెరమీద చూసినా... 'మరల నిదేల?' అని ఎవరూ ప్రశ్నించరు. ఏదో సందర్భంలో పరుచూరి సోదరులు అన్నట్టు... 'ప్రతి సినిమా కథ పురాణాల్లోంచి పుట్టిందే'. ఆ మాట నిజం కూడా. 'బాహుబలి'లోని దాయాదుల పోరు కురువంశంలోని గొడవల్ని గుర్తుకు తెస్తుంది. 'ముత్యాల ముగ్గు'లో కథానాయిక కష్టాలు అశోకవనంలోని సీతమ్మ తల్లిని తలుచుకునేలా చేస్తాయి. భూతద్దం పట్టుకుని కూర్చుంటే... సగానికి సగం సినిమాల్లో పురాణాల ఆనవాళ్లు కనిపించి తీరతాయి. కాకపోతే, నవతరం దర్శకులు పాతకొత్తలకు సాంకేతికతతో లంకె వేస్తున్నారు. కంప్యూటర్ జెనరేటెడ్ ఇమాజినరీ (సీజీఐ), విజువల్ ఎఫెక్ట్స్ (వీఎఫ్ఎక్స్), మోషన్ క్యాప్చర్ టెక్నాలజీలతో కనువిందుగా తీర్చిదిద్దుతున్నారు. ఆ ప్రయత్నంలో హాలీవుడ్ నిపుణుల సాయమూ తీసుకుంటున్నారు. అనగనగా... చిత్రాల్లో ప్రేక్షకుడు లీనమైపోవాలంటే వాతావరణం, దుస్తులు, వేషభాషలపైన చాలా శ్రద్ధ పెట్టాలి. అందుకే, పురాణ సినిమాల్ని ఇండస్ట్రీలో 'కాస్ట్యూమ్ డ్రామాలు'గా వ్యవహరిస్తారు. ఆ కళ మనకు కొత్త కాదు. ఒక్క ఆహార్యమేనా? రాముడు ఎంత గంభీరంగా ఉండాలో, కృష్ణుడు ఎంత మార్మికంగా నవ్వాలో, దశకంఠుడు ఎంత దర్పంగా నడవాలో, నారదుడు ఎంత గడుసుగా సంభాషించాలో... ప్రపంచానికి తూకమేసినట్టు తేల్చి చెప్పిందే తెలుగు పరిశ్రమ. ఆ పౌరాణిక ప్రతిభ టాలీవుడ్ జన్యువుల్లోనే ఉంది.

మనశ్శాంతి కోసమూ...

ఆధునిక జీవితంలోని ఒత్తిళ్లతో చిత్తయిపోతున్న మనిషికి సినిమాల్లోని వినోదం పూర్తిస్థాయి ఉపశమనాన్ని ఇవ్వలేకపోతోంది. ప్రేక్షకుడు కాస్తంత మానసిక ప్రశాంతతనూ కోరుతున్నాడు. పురాణ చిత్రాలు ఆ సాంత్వనను అందిస్తాయని నమ్ముతున్నాడు. థియేటర్ నుంచి ఇంటికెళ్తున్న సమయానికి... గుడికెళ్లి వచ్చినంత సంతృప్తినీ, చాగంటివారి ఉపన్యాసం విన్నంత అనుభూతినీ పొందుతున్నాడు. జెన్-జెడ్ విషయానికొస్తే... ఆన్‌లైన్-ఆఫ్‌లైన్ చర్చలూ, అప్పుడప్పుడూ చెలరేగే వివాదాలూ పురాణాల పట్ల వారిలో కుతూహలాన్ని రేకెత్తిస్తున్నాయి. రాముడి నాయకత్వ లక్షణాల గురించీ, కృష్ణుడి వ్యూహరచనా నైపుణ్యం గురించీ మరింత తెలుసుకోవాలనే జిజ్ఞాసను పెంచుతున్నాయి. అలా అని, పర్వాలకు పర్వాలు చదివేంత ఓపికా తీరికా ఎవరికీ ఉండటం లేదు. దీంతో, సూక్ష్మంలో మోక్షంలా పురాణ నేపథ్యంతో ఏ సినిమా వచ్చినా వదలకుండా చూస్తున్నారు. ఇతిహాసాల పరిధి ఒక ప్రాంతానికో, రాష్ట్రానికో పరిమితం కాదు. 'ఓవర్సీస్'లోనూ అపార ఆదరణ ఉంది. దీంతో మార్కెట్‌కూ ఢోకా ఉండటం లేదు. 'మిరాయ్', 'కార్తికేయ-2' లాంటి తెలుగు సినిమాలు ఉత్తరాదిని ఊపేయడమే ఇందుకు సాక్ష్యం. తాజాగా విడుదలైన గుజరాతీ చిత్రం 'లాలో! కృష్ణ సదా సహాయతే'... ఓ రిక్షావాలా కృష్ణభక్తి ఇతివృత్తంగా యాభై లక్షల బడ్జెట్‌తో తీసిన అతిచిన్న సినిమా. కలెక్షన్లు మాత్రం వంద కోట్ల మైలురాయిని దాటేశాయి. ఆ చిత్రాన్ని తిలకిస్తూ ప్రేక్షకులు 'జై శ్రీకృష్ణ' నినాదాలు చేస్తున్నారట. 'కార్తికేయ-2'లో అనుపమ్ ఖేర్ పాత్ర కృష్ణతత్వాన్ని ఉద్వేగంతో వివరిస్తున్నప్పుడూ అంతే! థియేటర్లలో ఈలలూ గోలలూ! గతంలో, భారీ బడ్జెట్ చిత్రాల పతాక సన్నివేశాలకే ఆ అదృష్టం దక్కేది. అయినా, దేవుడు తలుచుకుంటే చప్పట్లకు కొదవా!

పాతకొత్తల మేళవింపు


యువ హీరోలతోపాటు అగ్ర తారలు కూడా 'మైథలాజికల్ డ్రామా'ల పట్ల మక్కువ చూపుతున్నారు. ఒక్క ప్రభాస్‌ను దృష్టిలో ఉంచుకునే అరడజను కథలు సిద్ధంగా ఉన్నట్టు సమాచారం. ఇప్పటికే ఆయన ఓం రౌత్ దర్శకత్వంలో రామాయణం ఆధారంగా తీసిన 'ఆదిపురుష్'లో నటించారు. 'స్టార్ వార్స్' తరహా విజువల్స్‌తో ఆ చిత్రాన్ని నిర్మించారు ఓం రౌత్. కాకపోతే, పాత్రల ఆహార్యం పైన తీవ్ర విమర్శలు వచ్చాయి. బాక్సాఫీసు లెక్కల సంగతి ఎలా ఉన్నా, ఆ ప్రయత్నం దర్శకనిర్మాతల దృష్టిని రామకథ వైపు మళ్లించింది. తాజాగా రణబీర్ కపూర్ శ్రీరాముడిగా దర్శకుడు నితీశ్ తివారి 'రామాయణ్' చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. ఇందులో సాయిపల్లవి సీతగా, యశ్ రావణుడిగా కనిపిస్తారు. రెండు భాగాల నిర్మాణ వ్యయం నాలుగువేల కోట్లు పైమాటేనని అంచనా. ప్రభాస్, అమితాబ్, కమల్‌హాసన్, విజయ్ దేవరకొండ ప్రధాన పాత్రధారులుగా నాగ్ అశ్విన్ తీసిన 'కల్కి 2898 ఏ.డి' కూడా మహాభారతానికి సైన్స్ ఫిక్షన్‌ను జోడించి చేసిన వినూత్న ప్రయోగమే. కథలో కృష్ణుడు, అర్జునుడు,

భక్తుల కథలూ...

భక్తుల గాథలూ ప్రేక్షకాదరణకు నోచుకుంటున్నాయి. 'అఖండ'లో శివుడి ప్రతినిధిగా, ధర్మ సంస్థాపన కోసం పోరాడే 'అఘోరా' పాత్రలో బాలకృష్ణ వెండితెరను ఓ ఊపు ఊపారు. 'అఖండ 2: తాండవం'లోనూ బాలయ్య నట తాండవం ప్రేక్షకుల్ని మురిపిస్తోంది. శివపురాణం ఆధారంగా మంచు విష్ణు 'కన్నప్ప' తెరకెక్కింది. నిఖిల్ సిద్ధార్థ

యానిమేషన్‌లోనూ...

పౌరాణిక యానిమేషన్ చిత్రాలు కూడా సాంకేతిక ఇంద్రజాలంతో అందర్నీ ఆకట్టుకుంటున్నాయి 'మహావతార్ నరసింహ' ఆ కోవలోకే వస్తుంది. రూ.40 కోట్లతో తెరకెక్కిన ఆ చిత్రం రూ.325 కోట్లు వసూలు చేసింది. క్లీమ్ ప్రొడక్షన్స్ పతాకంపైన అశ్విన్‌కుమార్ అనే యువదర్శకుడు తెరకెక్కించాడు దీన్ని. మహావతార్ సినిమాటిక్ యూనివర్స్ నుంచి త్వరలోనే మిగిలిన తొమ్మిది దశావతార కథలూ రాబోతున్నాయి. దర్శకుడు చందు మొండేటి 'వాయుపుత్ర' పేరుతో హనుమంతుడి జీవితాన్ని యానిమేటెడ్ సినిమాగా తీర్చిదిద్దే ప్రయత్నాలు ప్రారంభించారు. సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ దీన్ని నిర్మిస్తోంది. ఈమధ్య నెట్‌ఫ్లిక్స్ వేదికగా విడుదలైన 'కురుక్షేత్ర' వెబ్ సిరీస్ పద్దెనిమిది రోజుల కురుక్షేత్ర సంగ్రామాన్ని పద్దెనిమిది పాత్రలతో చెప్పించింది.



'కార్తికేయ 3' కూడా త్వరలోనే పట్టాలెక్కనుంది. అరిషడ్వర్గాలు ఇతివృత్తంగా తీసిన 'అరి'లోనూ కృష్ణతత్వం ప్రతిధ్వనిస్తుంది. ఈ పరంపరలో గిరిజన దేవతలకు ప్రాధాన్యం ఇచ్చిన 'కాంతార'ది ఓ ప్రత్యేక స్థానం. అన్నట్టు, అప్పుడప్పుడూ దేవుళ్ళు మానవ రూపంలో తెర మీద ప్రత్యక్షం అవుతున్నారు. వాళ్లనే 'డెమీగాడ్స్' అంటోంది సినీ ప్రపంచం. 'శ్రీఆంజనేయం'లో అర్జున్ పాత్ర అలాంటిదే. 'గోపాల గోపాల', 'బ్రో' సినిమాల్లో కృష్ణుడిగా, కాలదేవుడిగా కనిపించారు పవన్‌కల్యాణ్. ఆ సినిమాలు హిందీలో విజయవంతమైన 'ఓ మై గాడ్', తమిళంలో ప్రేక్షకాదరణ పొందిన 'వినోదాయ సిత్తమ్'లకు రీమేక్. 'ఓరి దేవుడా' సినిమాలో వెంకటేశ్ కూడా ఇలాంటి పాత్రలోనే మెప్పించారు. తమిళ చిత్రం 'ఓ మై కడవులే' దీనికి మాతృక. ఇలాంటి 'ఆధునిక' దేవుళ్లు సిగార్ వెలిగిస్తూ ఆధ్యాత్మికతను బోధిస్తారు. బెంజ్ కారు నడుపుతూ జీవన కురుక్షేత్రంలో గెలవడం ఎలాగో నేర్పిస్తారు.

భారతీయ 'అవతార్'

హాలీవుడ్ సైతం భారతీయ పురాణాల నుంచి స్ఫూర్తిని పొందుతోంది. మనసు పెట్టి చూస్తే, జేమ్స్ కామెరాన్ 'అవతార్' సినిమాల్లోని పాత్రలకూ రామాయణ, భారతాలే స్ఫూర్తి అని సులభంగా అర్థమైపోతుంది. ఈ విషయాన్ని ఆయనే వెల్లడించారు కూడా. ఆ టైటిల్‌లోనే అచ్చమైన భారతీయత ఉంది. మరో హాలీవుడ్ మూవీ 'ఓపెన్‌హైమర్' మీద భగవద్గీత ప్రభావం కనిపిస్తుందంటారు సినీ పండితులు. 'ది లెజెండ్ ఆఫ్ బాగర్‌వాన్స్'లో రెండు ప్రధాన పాత్రలు కృష్ణార్జునులను గుర్తు చేస్తాయి. భారతీయ అతీంద్రియ శక్తులూ, కుండలిని ఉద్దీపనలూ, ధ్యాన స్థితిలో త్రికాల జ్ఞానాలను పొందే ఘట్టాలూ... హాలీవుడ్ సినిమాల్లో అప్పుడప్పుడూ కనిపిస్తున్న 'భారతీయ' దృశ్యాలు. అంతర్జాతీయ దర్శకులు నేరుగా పురాణాల్నే ఎంచుకునే రోజు ఎంతోదూరంలో లేదు.



కర్ణుడు, అశ్వత్థామ తదితర క్యారెక్టర్లను ఒడుపుగా ఇమిడ్చిన తీరు అన్ని తరాల్నీ సమంగా మెప్పించింది. రెండో భాగంలో... కర్ణుడి అంశతో పుట్టిన భైరవకూ, కలి పురుషుడు సుప్రీం యాస్కిన్‌కూ, చిరంజీవి అయిన అశ్వత్థామకూ మధ్య జరిగే పోరు హాలీవుడ్ మేకింగ్‌ను తలదన్నేలా ఉంటుందని ప్రచారం. అచ్చంగా ఇలాంటి పాత-కొత్తల జుగల్‌బందీగానే దర్శకుడు రాజమౌళి 'వారణాశి' సినిమాను తెరకెక్కిస్తున్నారు. ప్రపంచాన్ని చుట్టేసే ఓ ఆధునిక యువకుడితో త్రేతాయుగం నాటి రామాయణ గాథను ముడిపెట్టడం విశేషం. ఫస్ట్‌లుక్‌లో... త్రిశూలం చేతబట్టి, నందిపైన కనువిందు చేశారు రుద్ర పాత్రధారి మహేశ్. ఎన్టీఆర్‌ను దేవ సైన్యాధ్యక్షుడైన కార్తికేయుడిగా ప్రేక్షకులకు పరిచయం చేసే ప్రయత్నంలో ఉన్నారు దర్శకుడు త్రివిక్రమ్. ఇదే అవకాశంగా, అప్పుడెప్పుడో ఆగిపోయిన 'యమ' సినిమాలనూ ఎవరో ఒకరు కొనసాగించే అవకాశం లేకపోలేదు.

'సూపర్' దేవుళ్లు

అయినా, సూపర్‌మాన్‌లనూ బ్యాట్‌మాన్‌లనూ కళ్లకద్దుకుని దిగుమతి చేసుకోవాల్సిన భావ దారిద్ర్యం మనకెందుకూ? మన యోధులు మనకున్నారు. మన గాథలు మనకున్నాయి. కాబట్టే, దర్శకుడు ప్రశాంత్ వర్మ పాశ్చాత్య ప్రభావానికి లొంగకుండా... తన 'హను-మాన్'లో ఆంజనేయుడిని సూపర్ హీరోగా పరిచయం చేశారు. తేజ సజ్జా ప్రధాన పాత్రలో నటించిన ఈ సినిమాలో అంజనీపుత్రుడే అసలైన స్టార్. క్లైమాక్స్‌లో రామదూత రాకను ప్రేక్షకులు కరతాళ ధ్వనులతో స్వాగతిస్తారు. వందల కోట్లు వసూలు చేసిందీ సినిమా. తేజ మరోచిత్రం 'మిరాయ్'ని రామాయణంతో ముడిపెట్టారు దర్శకుడు కార్తిక్ ఘట్టమనేని. 'హను-మాన్'కి కొనసాగింపుగా 'జై హనుమాన్' తెరకెక్కుతోంది. ఇందులో 'కాంతార' ఫేమ్ రిషబ్‌శెట్టి ప్రధాన పాత్రధారి. 'మిరాయ్ 2' కూడా మహావేగంగా రూపొందుతోంది. ఇందులో రానా దగ్గుబాటి ప్రతినాయకుడు. గరుత్మంతుడు, వీరభద్రుడు, నాగేంద్రుడు, సుదర్శనుడు... తదితర పురాణ పాత్రలూ 'సూపర్' హీరోల స్థాయికి ఏమాత్రం తగ్గనివే. ఇక, దర్శకులదే ఆలస్యం!

అతి త్వరలో...

రాజమౌళి తన కలల ప్రాజెక్ట్ మహాభారతమేనని తరచూ చెబుతుంటారు. జక్కన్న మెదడులోని సృజనాత్మక విభాగం ఆ పనిలో ఉండే ఉంటుంది. ఆమిర్‌ఖాన్ కూడా భారతాన్ని వరుస చిత్రాలుగా అందించాలని ఉబలాటపడుతున్నారు. తన 'సినిమాటిక్ యూనివర్స్' పతాకం కింద భవిష్యత్తులో మరిన్ని పౌరాణిక నేపథ్య చిత్రాలు తీయబోతున్నట్టు ప్రశాంత్ వర్మ ప్రకటించారు. ఇంద్రుడి వృత్తాంతంతో 'అధీర' అనే చిత్రాన్ని తెరకెక్కించే ఆలోచనలో ఉన్నారాయన. 'మహాకాళి' పేరుతో నాయికా ప్రధాన చిత్రాన్నీ ఇప్పటికే ప్రకటించారు. దీని మూలాలు దేవీ భాగవతంలో ఉన్నాయని అంటున్నారు. 'మిస్టికల్ థ్రిల్లర్' అనే సరికొత్త జోనర్‌పైనా దర్శకులు దృష్టి పెడుతున్నారు. పురాణాలతో ముడిపడిన కథలోనే సస్పెన్స్, హారర్, ఘోస్ట్ వగైరా వగైరా మసాలా ఎలిమెంట్స్‌ను చొప్పిస్తూ ప్రేక్షకుల్ని థ్రిల్ చేయడమే ఈ సినిమాల లక్ష్యం. కార్తీక్ దండు దర్శకత్వంలో నాగ చైతన్య కథానాయకుడిగా రాబోతున్న 'వృషకర్మ' అందులో భాగం కావచ్చు. చిరంజీవి 'విశ్వంభర' కూడా పురాణాలతో ముడిపడిన కథే అని తెలుస్తోంది. విష్ణు పురాణాన్ని నేపథ్యంగా ఎంచుకున్న 'నాగబంధం' అనే భారీ బడ్జెట్ చిత్రం నిర్మాణ దశలో ఉంది. విరాట్ కర్ణ ఇందులో కథానాయకుడు. బెల్లంకొండ శ్రీనివాస్ 'హైందవ'లోనూ పురాణ ప్రస్తావనలు ఉన్నాయని పరిశ్రమ వర్గాల భోగట్టా!

★ ★ ★

దేర్ ఈజ్ సమ్‌థింగ్ మోర్ ఇంపార్టెంట్ దేన్ లాజిక్... ఇమాజినేషన్!

\- ఆల్‌ఫ్రెడ్ హిచ్‌కాక్

మహాద్భుతమని మెచ్చుకునేవాళ్లు మెచ్చుకుంటున్నారు. ఇదేం విడ్డూరమని విమర్శించేవాళ్లు విమర్శిస్తున్నారు. దేవుడితో పెట్టుకోవద్దని హెచ్చరించేవాళ్లు హెచ్చరిస్తున్నారు. పురాణాలను కలుషితం చేయొద్దని వేడుకునేవాళ్లు వేడుకుంటున్నారు. ఈ వివాదాలేవీ పట్టించుకోకుండా, సగటు ప్రేక్షకుడు సినిమాను సినిమాలానే చూస్తున్నాడు. మనసుకు నచ్చితేనే ఆదరిస్తున్నాడు. దేవుడి సినిమాకైనా... తలరాత రాసేది ప్రేక్షక దేవుడే! ★

పరిశోధన

ఇవి డీఎన్ఏ క్యాసెట్లు

ఓ పాతికేళ్లు వెనక్కి వెళ్లండి... అప్పుడు టేప్‌రికార్డర్‌లో పాటలని ఎలా వినేవారు? రెండు చక్రాలతో ఉన్న టేప్ తరహా క్యాసెట్లని వాడేవారు కదా! సీడీలూ, పెన్‌డ్రైవ్‌లూ వచ్చాక ఆ క్యాసెట్లు ఓ జ్ఞాపకంగానే మిగిలిపోయాయి. ఇప్పుడు వాటి గురించిన ప్రస్తావన ఎందుకూ అనుకోవచ్చు. అచ్చంగా అలాంటి క్యాసెట్లనే చైనాలోని సదరన్ యూనివర్సిటీ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీకి చెందిన శాస్త్రవేత్తలు ఆవిష్కరించారు. కానీ దీని పేరు 'డీఎన్ఏ క్యాసెట్'. వీటి సామర్థ్యం ఎంతో తెలిస్తే... కళ్లు తేలేయాల్సిందే. ఒక క్యాసెట్‌తో కొన్ని కోట్ల పాటలని అవలీలగా వినొచ్చు. అయితే ఈ డీఎన్ఏ క్యాసెట్లని పాటలని వినడం కోసం తయారు చేయలేదు... డేటాని దాచిపెట్టేందుకు తయారుచేశారు. టెక్నాలజీ పెరుగుతున్న కొద్దీ, కొండలా పేరుకుపోతున్న డిజిటల్ సమాచారాన్ని దాచిపెట్టడానికి హార్డ్ డ్రైవ్‌లు సరిపోవడం లేదు. డేటా సెంటర్లపైన భారం పెరుగుతోంది. ఈ నేపథ్యంలోనే శాస్త్రవేత్తలు శరీరంలోని డీఎన్ఏపైన దృష్టి పెట్టారు. మెలికలు తిరిగిన పాములా ఉండే డీఎన్ఏలోని ఒక్కో కణంలో సుమారుగా ఆరువేల పుస్తకాల్లోని సమాచారాన్ని దాచిపెట్టొచ్చు. ఇక కొన్ని వేల కిలోమీటర్లు ఉండే డీఎన్ఏ పోగుల్లో ఎంత సమాచారాన్ని దాచిపెట్టొచ్చో ఊహించుకోవడం కష్టమే. అందుకే వీటి స్ఫూర్తితో సింథటిక్ డీఎన్ఏ పోగులని తయారుచేసి, వాటిని క్యాసెట్ టేప్‌లా మలిచి డిజిటల్ సమాచారాన్ని దాచిపెట్టొచ్చని నిరూపించారు. అవసరం అయినప్పుడు వీటిని తిరిగి వాడుకోవచ్చట.



చేప చూపిన దారి...



మైక్రో ప్లాస్టిక్... అత్యంత సూక్ష్మంగా ఉండే ఈ ప్లాస్టిక్ కణాలు, వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంట్లలోని వడపోతలకీ అందని పరిస్థితి. అందుకే ఇవి తల్లిపాలలోకీ చేరిపోతున్నాయి. ఆపైన రక్తనాళాల్లోకీ వెళ్లి గుండెపోటు, క్యాన్సర్లకి కారణమవుతున్నాయి. ఇంత హానిచేసే మైక్రోప్లాస్టిక్‌ని 99 శాతం వడకట్టేసే ఒక ప్రత్యేకమైన ఫిల్టర్‌ని జర్మనీకి చెందిన బాన్ యూనివర్సిటీ శాస్త్రవేత్తలు కనిపెట్టారు. ఇంతకీ వీరి ఆవిష్కరణకి స్ఫూర్తినిచ్చిందెవరో తెలుసా... చేపలట! ఆశ్చర్యంగా ఉందా... చేపలు శ్వాసించడానికి మొప్పలు ఉంటాయని తెలుసు కదా. ఇవి గరాటు ఆకారంలో, చిక్కని వలలాంటి నిర్మాణంతో ఉంటాయి. చేపలు నీటిలోని ఆక్సిజన్‌ని పీల్చుకునేటప్పుడు అడ్డం వచ్చిన చెత్తని ఈ మొప్పలతో వడకట్టి, ఆ చెత్తని గొంతు దగ్గర దాచిపెట్టుకుంటాయి. ఈ క్రమంలో అవి 99శాతం శుద్ధమైన మంచినీటిని తిరిగి నదులూ, సముద్రాల్లోకి వదులుతాయి. నిరంతరాయంగా పనిచేసే చేప మొప్పల్లోని ఈ నిర్మాణమే జర్మనీ శాస్త్రవేత్తలు మైక్రోప్లాస్టిక్‌ని వడకట్టే ఫిల్టర్‌ని తయారుచేసేందుకు స్ఫూర్తినిచ్చింది. ఇళ్లలోని వాటర్ ఫిల్టర్లలో వీటిని అమర్చడం ద్వారా మైక్రోప్లాస్టిక్‌ని వడకట్టడం తేలిక అవుతుందని శాస్త్రవేత్తలు అంటున్నారు.

వీటితో అందం లోపలనుంచీ...



ఖరీదైన క్రీమ్‌లూ, సీరమ్‌లూ వాడితే చర్మం మెరిసిపోతుందని అనుకుంటారు చాలామంది. వాటితో పనిలేకుండా చర్మాన్ని లోలోపల నుంచీ మెరిపించే అసలుసిసలు రహస్యాన్ని కనిపెట్టేశారు న్యూజిలాండ్‌కి చెందిన ఒటాగో యూనివర్సిటీ శాస్త్రవేత్తలు. వారంలో ఐదు రోజులన్నా విటమిన్-సి ఉన్న ఆహారాన్ని తీసుకుంటే, అది కొల్లాజెన్ స్థాయులని పెంచి చర్మాన్ని మెరిపిస్తుందట. విటమిన్-సికి నీటిలో కలిసే గుణం ఉండటం వల్ల దీంతో క్రీమ్‌లూ, సీరమ్‌లూ తయారు చేస్తుంటారు. అయితే ఈ క్రీమ్‌లు ఎంత ఖరీదైనవైనా, మహా అయితే చర్మం పైపొర- అంటే ఎపిడెర్మిస్ పొర వరకే చేరుకోగలుగుతాయట. అదే ఆహారం నుంచీ విటమిన్-సి తీసుకుంటే అడుగున ఉన్న డెర్మిస్ పొరవరకూ వెళ్లి చర్మంలోని ప్రతి కణాన్నీ సి-విటమిన్‌తో నింపి వాటిని ఆరోగ్యంగా ఉంచుతాయట. ఒటాగో శాస్త్రవేత్తలు ఇందుకోసం కొంతమంది వయసు మళ్లిన వారిని ఎంచుకుని వారిలో కొందరికి విటమిన్-సి అధికంగా ఉన్న సన్‌గోల్డ్ కివీ రకాన్నీ, ఇతర నిమ్మజాతి పండ్లనీ రోజూ అందించేవారట. మిగిలిన వారికి క్రీమ్‌లూ, సీరమ్‌లని ఇచ్చారు. ఇందులో క్రీమ్‌లు వాడే వారితో పోలిస్తే, ఆహారం నుంచి విటమిన్-సి అందుకున్న వారిలో ఎనిమిది వారాల్లోనే చర్మాన్ని సాగకుండా చేసే కొల్లాజెన్ గణనీయంగా పెరగడం గమనించారు. అందుకే వారంలో ఐదురోజులన్నా నిమ్మజాతి పండ్లు, బ్రోకలి, క్యాప్సికమ్ వంటివి తింటే చర్మం ఆరోగ్యంగా ఉంటుందని అంటున్నారు.



కొవ్వు కాదు కండను పెంచాలి

'వయసు పెరుగుతోంది... కాస్త బొజ్జ కూడా పెరిగితే తప్పేంటి' అనుకుంటున్నారా? కానీ, ఈ పొట్ట చుట్టూ ఉండే కొవ్వు మెదడు వయసుని తగ్గిస్తుందని అంటున్నారు రేడియోలాజికల్ సొసైటీ ఆఫ్ నార్త్అమెరికాకు చెందిన పరిశోధకులు. పొట్ట దగ్గర ఉండే కొవ్వుకీ, మెదడు పనితీరుకీ సంబంధం ఏంటీ అని ఆలోచిస్తున్నారా? పొట్ట చుట్టూ ఉండే కొవ్వుని వైద్య పరిభాషలో విసరల్ ఫ్యాట్ లేదా హిడెన్ ఫ్యాట్ అంటారు. ఈ కొవ్వు పొట్టతోపాటూ గుండె, కిడ్నీల చుట్టూ కూడా పేరుకుంటుంది. 55 ఏళ్ల వయసున్న పదకొండువందలమందిని ఎంపిక చేసుకుని వారికి ఎమ్ఆర్ఐ పరీక్షలు చేసినప్పుడు ఓ ఆసక్తికరమైన విషయం బయటపడింది. విసరల్ ఫ్యాట్ ఎక్కువగా ఉన్నవారిలో అల్జీమర్స్, డిమెన్షియాలాంటి మతిమరపు సమస్యలు కనిపిస్తే... విసరల్ ఫ్యాట్ తక్కువగా ఉండి, కండబలం ఎక్కువగా ఉన్నవారిలో మెదడు చురుగ్గా ఉండటం గమనించారు. పొట్టచుట్టూ ఉండే కొవ్వు శరీరంలో ఇన్‌ఫ్లమేషన్‌కి కారణం అవడంతోపాటు జీవక్రియలపైన ఒత్తిడి తీసుకొస్తుందట. ఫలితంగా మెదడు పనితీరు మందగిస్తుంది. అందుకే, వ్యాయామం చేసి కొవ్వు తగ్గించుకుని కండని పెంచుకొమ్మంటున్నారు శాస్త్రవేత్తలు.





తేగలకు... ఇంత సీనుందా!

తేగలు... ఈ పేరు వింటే కొందరు 'ఏమైనా రుచాపచా, ఎలా తింటారో' అని ముఖం చిట్లిస్తే- మరి కొందరు తేగల సీజన్ కోసం ఎదురు చూస్తూ 'అబ్బ, చలికాలమంతా రోజూ తినొచ్చు' అంటూ కట్టలు కట్టలు కొని తెచ్చుకుంటారు. ఆకట్టుకునే రంగూ, నోరూరించే రుచీ వీటికి అంతగా లేకపోయినా- వాటిల్లోని పోషకాల సంగతులన్నీ తెలుసుకున్నారంటే... అమాంతం తేగ ముక్కను నోట్లో పెట్టేసుకుంటారంతే. ఆసక్తికరమైన ఆ ప్రయోజనాల చిట్టానే ఇది...



కేకూ, పిజ్జా, బిస్కెట్ తదితర బేకరీ పదార్థాల్నీ... తియ్యటి స్వీట్లనీ... ఇడ్లీ, దోశ వంటి టిఫిన్లనీ... నూడుల్స్, మంచూరియా లాంటి ఫాస్ట్‌ఫుడ్స్‌నీ... హెల్దీ హెల్దీగా మార్చడానికి ప్రయత్నిస్తుంటారు మాస్టర్ షెఫ్‌లు. ఆ ప్రయోగాల్లో భాగంగా ఈమధ్య పోషకాలతో నిండిన తేగల్నీ అన్నిరకాల వంటల్లో వేస్తున్నారు. ఎలాంటి ఉపయోగాలూ లేని మైదా వాడకాన్ని తేగల పొడితో సగానికి సగం తగ్గిస్తున్నారు. పిల్లలకు పాలల్లో కలిపే మిల్క్ పౌడర్ దగ్గర్నుంచి క్యాండీల వరకూ ఈ తేగలతో ఎన్నో రకాల ఉత్పత్తులూ వస్తున్నాయి. ఇంతకీ అసలేంటీ తేగలు...?

వర్షాకాలంలో మట్టిలో పెట్టిన తాటి బుర్రల నుంచి వచ్చే మొలకలే ఈ తేగలు. కొన్ని చోట్ల వీటినే గేగులు అని పిలుస్తారు. తాటిచెట్లు ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో కనిపించే ఈ తేగలు చలికాలంలోనే దొరుకుతాయి. ఒకప్పుడు పల్లెల్లో మంచి చిరుతిండిగా పేరు పొందిన ఈ తేగలు- ఇప్పుడు నగరాల్లోనూ విరివిగానే కనిపిస్తున్నాయి. శీతకాలం రాగానే రోడ్ల పక్కన- ఉడకబెట్టినవీ, కాల్చినవీ అమ్ముతుంటారు. చిన్నప్పటి నుంచి తినే అలవాటు ఉన్నవాళ్లు తప్ప మిగతావాళ్లు వాటిని అంతగా ఇష్టపడరు. కానీ తేగల్ని- తక్కువ ఖర్చులోనే సహజసిద్ధంగా దొరికే పోషకాహారం అని చెబుతారు పోషకాహార నిపుణులు.

ఎంత మేలో...

తేగల ద్వారా పొటాషియం, మెగ్నీషియం, ఫాస్ఫరస్, క్యాల్షియం, ఐరన్ ఖనిజాలు సమృద్ధిగా అందుతాయి. ఇంకా వీటిల్లో పీచు అధికంగా ఉంటుంది. బి-విటమిన్, సి-విటమిన్, ప్రొటీన్లూ, యాంటీఆక్సిడెంట్లూ ఉంటాయి. అందుకే వీటిని తరచూ తినడం వల్ల ఆరోగ్యానికి ఎంతో మేలు.

★ చలికాలంలో జీర్ణవ్యవస్థ కాస్త మందగిస్తుంది. ఈ సీజన్లో అధిక పీచుతో ఉండే తేగల్ని ఆహారంలో చేర్చుకుంటే జీర్ణశక్తి మెరుగవుతుంది. పిల్లలకీ, పెద్దలకీ వీటి వల్ల ఆకలి పెరుగుతుంది. ఇంకా మలబద్ధకం తగ్గుతుంది. ముఖ్యంగా పైల్స్‌తో ఇబ్బంది పడేవాళ్లకు తేగలు సూపర్ ఫుడ్.

★ రక్తంలో చెడు కొలెస్ట్రాల్‌ని తగ్గించడంలోనూ ముఖ్యమైన పాత్ర పోషిస్తాయి తేగల్లోని పోషకాలు. వీటితో గుండెజబ్బులూ దరిచేరవు. సి-విటమిన్‌తో రోగనిరోధక శక్తిని పెంచే తేగలతో కొన్ని రకాల క్యాన్సర్ల ముప్పు కూడా తగ్గుతుందట.

★ తేగల్లో ప్రొటీన్ శాతం ఎక్కువ. ఇది శరీరంలో దెబ్బతిన్న కండరాల్ని బాగు చేయడానికీ, హార్మోన్లూ, ఎంజైమ్‌ల తయారీకీ, బరువు నియంత్రణకీ ఎంతో ఉపయోగపడుతుంది.

★ పేగుల్లో రక్షణ వ్యవస్థను మెరుగు పరచడానికీ తేగలు బాగా పనిచేస్తాయి.

★ గ్లైసెమిక్ ఇండెక్స్ తక్కువగా ఉండే ఈ తేగల్ని మధుమేహులూ తినొచ్చు. చక్కెర స్థాయిలతోపాటు రక్తపోటునీ నియంత్రిస్తాయి.

★ పోషకాహార లోపాన్ని తగ్గించే తేగలను గర్భిణులూ, బాలింతలూ తప్పకుండా ఆహారంలో చేర్చుకోవాలి. వీటిల్లోని ఐరన్ రక్తహీనతను నివారిస్తుంది. అంతేకాదు, గర్భాశయ బలానికి తోడ్పడుతుంది. తేగలతో నెలసరి సమయంలో వచ్చే నొప్పులూ తగ్గుతాయి.

★ తేగల్లో తక్షణ శక్తిని ఇచ్చే పిండి పదార్థాలు ఉంటాయి. వీటిల్లోని అధిక నీటి శాతం శరీరాన్ని డీహైడ్రేట్ అవకుండా కాపాడుతుంది. దీంతో మూత్రనాళ ఇన్‌ఫెక్షన్లూ తగ్గుతాయి.

★ తేగలతో ఎక్కువ మొత్తంలో క్యాల్షియం అందుతుంది కాబట్టి ఎముకల దృఢత్వానికి మంచి చేస్తాయి ఇవి. వీటిని తింటే పిల్లలు ఎత్తు పెరుగుతారు. పెద్దల్లో ఎముకల పెళుసుదనం తగ్గుతుంది. ఇంకా వీటిని బాగా నమిలి తినడం వల్ల దంతాల గార పోతుంది, నాలుక శుభ్రం అవుతుంది.

రసాయన ఎరువుల్లేకుండా దొరికే ఈ అద్భుతమైన ఆహారంతో ఇలా ఎన్నో లాభాలు ఉన్నాయి కాబట్టే- అచ్చంగా వాటిని తినలేని వారికీ, సులువుగా పిల్లలు కూడా తినడానికీ తేగల నుంచి వివిధ ఆహార పదార్థాలు అందుబాటులోకి వచ్చాయి. తేగల రవ్వ, పిండి, మాల్ట్ ఉత్పత్తులు ఇప్పుడు మార్కెట్లో చాలానే ఉన్నాయి. చిన్నారుల కోసం ప్రత్యేకంగా తేగల పాల పొడి, క్యాండీలూ వస్తున్నాయి. ఇంకా మిఠాయిల నుంచి కేకుల వరకూ రకరకాల తేగల స్పెషల్ ఐటమ్స్‌ని తయారుచేస్తున్నారు ఫుడ్ లవర్స్. ★

పోషకాలు

వంద గ్రాముల కాల్చిన తేగల్లో...

శక్తి :	130 నుంచి 384 కిలో క్యాలరీలు
పిండి పదార్థాలు:	24 నుంచి 85 గ్రాములు
ప్రొటీన్:	8.5 గ్రా.
కొవ్వు:	0.3 గ్రా.
పీచు:	7.3 గ్రా.
క్యాల్షియం:	53 మిల్లీగ్రాములు
ఐరన్:	1.7 మి.గ్రా.



అమ్మమ్మ నగ... అమ్మాయికి నచ్చేస్తోందిగా!



అమ్మమ్మ నగలు అమ్మకు,
అమ్మ నగలు అమ్మాయికి... ఇలా తరతరాలుగా కొనసాగుతుంది ఆభరణాల వారసత్వం. అలా వచ్చిన నగల్ని మార్చుకుంటూ, నడుస్తున్న ట్రెండ్‌కి తగ్గట్టుగా ఎప్పటికప్పుడు కొత్తవి చేయించుకుంటుంది నయాతరం. కానీ ఈ ఏడాది ఓ గమ్మత్తు జరిగింది. గిర్రున తిరిగే ఫ్యాషన్ ప్రపంచంలో ప్రస్తుతం ఆ పాతతరం ఆభరణాలే మళ్లీ సీన్‌లోకి వచ్చాయి. ఒకప్పటి నగలపెట్టెలోని బుగాడి, జిలేబీ, బుల్లాకు, తాళల గుత్తి లాంటి అలనాటి ఆభరణాలు ఈ ఏడాది 'ట్రెండింగ్ జ్యువెలరీ' అయ్యాయి. పాతతరం నగల ఆ సరికొత్త ముచ్చట్లు మీరూ వినేయండి మరి!

బుగాడి ట్రెండ్!



అతివల మాటలకు తగ్గ తాళం వేసే చెవి బుట్టకమ్మల్లో ఎన్నో రకాలు. ఫుల్‌స్టాప్స్ అంటూ లేని ఫ్యాషన్ ప్రపంచంలో నిరంతరం కొత్త డిజైన్లు వస్తూనే ఉంటాయి. చెవి అలంకరణ కోసం అందులో మోడల్స్ కాకుండా ఈసారి వెరైటీగా కొత్త జ్యువెలరీ వచ్చి చేరింది. చెవి పైవైపు అంచున పెట్టే ఈ ఆభరణం పేరు 'బుగాడి'. తెలంగాణ, మహారాష్ట్ర, కర్ణాటక, తమిళనాడు... తదితర రాష్ట్రాల్లోని ఈ పురాతన సంప్రదాయ ఆభరణం- ఫ్యాషన్ మేకర్ల పుణ్యమా అని ఇప్పుడు తెగ సందడి చేస్తోంది. పెళ్లికూతురి సింగారంలో ప్రత్యేక ఆకర్షణగా మారిన ఈ నగ- వెస్ట్రన్‌వేర్‌కు తగ్గట్టూ వస్తోంది. ఒకప్పుడు ప్రత్యేకంగా చెవి కుట్టించుకుని మరీ ఈ నగను ధరిస్తే ఇప్పుడా అవసరమూ లేకుండా 'క్లిప్ ఆన్, స్క్రూ బ్యాక్, కఫ్' స్టయిల్స్‌తో తయారుచేస్తున్నారు. కెంపులూ, పచ్చలూ, ముత్యాల అల్లికలతో చూడచక్కని డిజైన్లలో చెవిపోగులూ, హారాలూ, పాపిట బిళ్లకు మ్యాచ్ అయ్యేలా నగల సెట్లలోనూ వీటిని రూపొందిస్తున్నారు. ప్రముఖ చిత్రకారుడు రాజా రవివర్మ చిత్రాల్లోనూ మెరిసిన ఈ అందాల బుగాడిని ఇప్పుడు మీరూ అలంకరించుకున్నారంటే- 'రవి వర్మకే అందని ఒకే ఒక అందానివో...' అంటూ మీ సన్నిహితులు సరదాగా పాటలు పాడేస్తారు కూడా!

అందాల తాళాల గుత్తి!



అప్పట్లో బంగారు నగలూ, డబ్బులూ దాచిపెట్టుకునే అల్మారా తాళాల్ని- భద్రంగా నడుము దగ్గర చీరలో దోపుకునేవాళ్లు ఆడవాళ్లు. ఆ తర్వాత ఆ తాళాల్ని ఓ దగ్గర పట్టి ఉంచే తాళాల గుత్తి కాస్తా నగలా రూపాంతరం చెందుతూ వచ్చిందేమో! 'చాబీ చల్లా'గానూ పిలిచే ఈ నగ... ఇదివరకు వెండి నగిషీలతో మెప్పిస్తే ఇప్పుడు బంగారు ధగధగలతో రాళ్ల తళుకులతో తయారైంది. అమ్మాయి అందాన్ని పెంచే చీర, లెహెంగా ఓణీలకు చక్కటి జత అయింది. మార్కెట్లో కనిపిస్తున్న తాళాల గుత్తి నగల డిజైన్లు చూస్తుంటే... వారసత్వంగా వచ్చిన ఈ నగ- వయ్యారిభామల మదినీ దోచేసింది అనడంలో సందేహం లేదంటే నమ్మండి!

హాత్‌ఫూల్ సొగసు!



చిన్నదాని కోమలమైన చేతులకు మరింత అందాన్ని అద్దుతోంది రింగ్ బ్రేస్‌లెట్. వేలి ఉంగరం నుంచి చేతి బ్రేస్‌లెట్ వరకూ కలిపి ఉంచే ఈ నగ- ఈ ఏడాది ఫ్యాషన్ ప్రేమికుల జాబితాలో చేరింది. అప్పట్లో మహారాణుల చేతుల మీద మాత్రమే కనిపించిన ఈ 'హాత్‌ఫూల్' జ్యువెలరీ... రాన్రానూ సంపన్నవర్గాల అమ్మాయిల నగల్లోకీ చేరింది. ఆ తర్వాత నవవధువు చేతిపైనా మెరిసింది. అలా ప్రత్యేక సందర్భాల్లోనే ధరించే ఆ నగ దాని లుక్కును మార్చుకుని మళ్లీ వచ్చింది. ముత్యాలూ, కుందన్లూ, రత్నాలతో సింపుల్ డిజైన్లలో దొరుకుతోంది. 'నేను అన్ని నగలు వేసుకోలేను' అనే టీనేజర్లు కూడా 'ఇది భలే స్టైలిష్‌గా ఉందే' అంటూ ఈ రింగ్ బ్రేస్‌లెట్లతో తయారైపోతున్నారు!

ఇది సూర్యచంద్రుల సింగారం!





మెడలో ఎన్ని నగలు వేసుకున్నా హెయిర్ యాక్సెసరీస్‌తో వచ్చే ఆ అందమే వేరు. అందుకే తరతరాలుగా జడ సింగారం కోసం ఎన్నో బంగారు ఆభరణాలు వస్తున్నాయి. చిన్నారులు పట్టు పావడా వేసుకున్నా, పెద్దవాళ్లు జరీ చీర కట్టుకున్నా చక్కగా జడ వేసుకుని తల మీద పాపిటకు అటూ ఇటూ సూర్యచంద్రుల బిళ్లల్ని పెట్టారంటే- అదిగో, అప్పుడొస్తుంది అసలైన సంప్రదాయ అందం. కొన్ని ఏళ్ల క్రితం మహిళల అలంకరణలో మెరిసిన ఆ నగ- ఈ ఏడాది మళ్లీ ఫ్యాషన్ అయింది. సూర్య, చంద్రుల ఆకృతుల్లో, ముచ్చటైన నగిషీలతో అలరిస్తోంది. పిల్లల కోసం ముందు నుంచే నగల్ని డిజైన్ చేయించుకునే అమ్మలెందరో 'ఎంతైనా ఓల్డ్ ఈజ్ గోల్డ్' అంటూ అలనాటి ఈ సూర్యచంద్రుల ఆభరణాల్నీ కొనేస్తున్నారు!

సరికొత్త జిలేబీ!

బంగారు దుకాణాల్లోకి వెళ్లిన అమ్మాయిలు ఈమధ్య 'జిలేబీలో ఏమేం డిజైన్లు ఉన్నాయో కాస్త చూపించండి' అంటుంటే... ట్రెండ్ ఫాలో అవని వాళ్లు 'బంగారం షాపులో స్వీట్ గురించి అడగటం ఏంటీ' అని కాస్త ఆశ్చర్యపోయినా- మిగతా వాళ్లందరికీ మాత్రం వాళ్లు అడిగేది జిలేబీ జ్యువెలరీ కోసమని ఇట్టే అర్థమైపోతుంది. ఏళ్ల తరబడి సంప్రదాయ ఆభరణాల్లో ఒకటైన ఈ జిలేబీ అల్లిక నెక్లెసు గురించి ఇంట్లో ఉన్న పెద్దవాళ్లకి బాగా తెలుసు. జిలేబీలా చుట్టలు, చుట్టలుగా ఉంటుంది కాబట్టే ఈ నగకు ఆ పేరు పెట్టారేమో. మెడ మొత్తాన్నీ చుట్టే జిలేబీ నగను ఒక్కటి పెట్టినా చాలు, అమ్మాయికి ఎంతో నిండుదనం వచ్చేస్తుంది. ట్రెడిషనల్ నగల్ని ఇష్టపడుతున్న ఈతరానికి ఆ విషయం బాగా నచ్చినట్టుంది, మళ్లీ ఒకప్పటి ఈ క్లాసికల్ జ్యువెలరీ మీద మనసు పారేసుకుంటోంది. అందుకు తగ్గట్టే బోలెడన్ని డిజైన్లూ మార్కెట్లో హల్‌చల్ చేస్తున్నాయి. గుత్తపూసలూ, కాసు బిళ్లలూ అదనంగా జోడిస్తూ దీనికి కొత్తలుక్కును తెస్తున్నారు. ఒకే నగ రెండు, మూడు రకాలుగా మార్చుకునేలా కూడా తీర్చిదిద్దుతున్నారు. ఇంతకీ మీకు ఏ జిలేబీ నచ్చింది?

నాను నెక్లెస్!



కుందనపు బొమ్మ అందమైన మెడను హత్తుకునే నగ- చోకర్. బంగారు మెరుపుల్లో, ముత్యాల సొగసుల్లో చక్కని నగిషీల పెండెంట్లతో ఎంతగానో మెప్పించిన ఈ ఆభరణం... అమ్మమ్మల కాలంలోనూ ఉండేది. రత్నాలు పొదిగిన గుండ్రటి పెద్ద బిళ్లలతో, సాదా బంగారు గొలుసుల డిజైన్లతో అమ్మాయిల నగల్లో కనిపించేది. ప్రాంతాన్ని బట్టి 'అడ్డిగ, అద్దిగే, నాను' అంటూ ఈ సంప్రదాయ చోకర్‌ని రకరకాల పేర్లతో పిలిచేవాళ్లు. తరతరాల్ని మెప్పించిన ఈ నగ ఇప్పుడు ఈతరానికీ ఫేవరెట్ జ్యువెలరీ అయింది. 'చోకర్లలో ఎన్నెన్ని డిజైన్లు ఉన్నా... అవ్వ, అమ్మ వేసుకున్న అలనాటి ఆ అడ్డిగ అందమే అందం' అంటూ ఈతరం కూడా ఆ పాత నగ మీద మనసు పారేసుకుంది. దీంతో మళ్లీ ట్రెండింగ్‌లోకి వచ్చి, ఈ ఏడాది బంగారు దుకాణాల్లో డిస్‌ప్లే పీస్‌గానూ చేరిందీ ఆభరణం. అన్నిరకాల ముస్తాబులకూ సరిపోయేలా డిజైనర్లు ఈ నాను నెక్లెసును నయా డిజైన్లలోనూ తీర్చిదిద్దుతున్నారు.

బుల్లాకు మెరిసెను!



పెళ్లిమండపంలో కూర్చునే వధువు ఆభరణాలకు ఏమాత్రం తగ్గకుండా పెళ్లికొచ్చే అతిథులూ అదిరిపోయే నగలతో ముస్తాబవుతున్నారు. కానీ ఒకే ఒక చిన్న నగ ఆ పెళ్లికూతురి అలంకారాన్ని కొత్తగా చేసింది. అదే ముక్కుకు పెట్టిన ముత్యమంత బుల్లాకు. మరింత సంప్రదాయంగా కనిపించడానికి ముక్కు పుడకల్ని పెట్టుకుంటున్న ఈతరం అమ్మాయిలు... ఇప్పుడు ముక్కు మధ్యలో పెట్టుకునే బుల్లాకుకీ సింగారంలో చోటు ఇచ్చేశారు. తమిళనాడు సంప్రదాయానికి చెందిన ఈ నగ- మొన్నమొన్నటి వరకూ నాట్యకారులకు మాత్రమే సుపరిచితం. కొన్నిప్రాంతాల్లో అమ్మమ్మలూ, నానమ్మలూ పెట్టుకోవడమే చూసుంటారు. కానీ ఇప్పుడు సెలబ్రిటీల నుంచి సామాన్యుల దాకా అందర్నీ ఆకట్టుకుంటోంది. పుల్లాకు, బుల్లాకు పేర్లతో పిలిచే ఈ ఆభరణంలో వజ్రాలూ, రత్నాలూ పొదిగినవీ వస్తున్నాయి. ఈసారి అన్ని నగలతోపాటు ఈ బుల్లాకునీ పెట్టుకున్నారంటే చూసినవారంతా 'ఎరుపు లోలాకు కులికెను కులికెను, ముక్కు బుల్లాకు మెరిసెను మెరిసెను' అంటూ మీ అలంకరణని వర్ణించకుండా ఉంటారా?

కథ

తిరిగొచ్చిన అహం

– ఆర్.వి.రాఘవరావు

కృష్ణ విసురుగా బెడ్‌రూమ్‌లోకి వచ్చి కోపంగా "అసలు నువ్వు ఆలోచించే చేస్తున్నావా?" అన్నాడు భార్య అరవిందతో.

ఉతికిన బట్టలు మడతపెట్టి బీరువాలో పెడుతున్న అరవింద వెనుదిరగకుండానే "అన్నీ ఆలోచించే చేశాను" అంది ప్రశాంతంగా, 'అన్నీ' అన్న పదాన్ని నొక్కిచెపుతూ. రెట్టింపైన కోపాన్ని ఉక్రోషం చుట్టుముట్టగా నిస్సహాయంగా బెడ్ పక్క కుర్చీలో కూలబడ్డాడు కృష్ణ.

కొత్తగా కొన్న ట్రిబుల్ బెడ్‌రూమ్ అపార్ట్‌మెంటులో తూర్పు వైపుగా ఉన్న తండ్రి రూమ్ నిశ్శబ్దంగా ఉంది. అయిదేళ్ళ చింటూ రూమ్‌లోంచి మాత్రం టీవీ సౌండ్ వినబడుతోంది. తనకేం సమస్య వచ్చినా తండ్రి దగ్గరకు పోయి కాసేపు కూర్చుని సేద తీరటం కృష్ణకు అలవాటు. ఇపుడు సమస్య తండ్రిదే... కాదు, సమస్య తనదే. కాదు కాదు... తనే తండ్రికి సమస్య. రోజూలా మాట్లాడటం కాదు, ఆయన వంక చూడాలన్నా గిల్టీగా ఉంది కృష్ణకు- తన భార్యవల్ల.

ముండ్లమూరు గవర్నమెంటు స్కూల్లో క్లర్క్‌గా పనిచేసి రిటైరైన తండ్రిని, తల్లి మరణానంతరం కృష్ణ రెండు నెలలక్రితం తన వద్దకు తెచ్చుకున్నాడు. సాయంత్రం పదీ పదిహేను నిమిషాలు వాకింగ్‌కి తప్ప ఆయన పెద్దగా బయటకు వెళ్ళడు. రెండుపూటలా స్నాక్స్, భోజనంలో ఏ లోటూ చేయదు అరవింద. మూడు నెలలకొకసారి కృష్ణ తన హెల్త్ ఇన్సూరెన్స్ కార్డు మీద తండ్రికి చెకప్ చేయిస్తాడు. అంతేకాదు, ఆయనకు ఏది ఎప్పుడు అవసరమో గ్రహించి తక్షణం అమరుస్తుంటాడు కూడా.

ఆయన తనకు వచ్చిన రిటైర్‌మెంట్ బెనిఫిట్స్‌తో కొడుకు ఇంటి లోన్‌లో కొంత తీరుస్తానన్నా- కృష్ణ- ముఖ్యంగా కోడలు అరవింద- ఒప్పుకోలేదు. తర్వాత ఆయన బెనిఫిట్స్ ప్లస్ ఈ రెండునెలల పెన్షన్‌కు తమ డబ్బు కొంత కలిపి ముండ్లమూరులోని ఆయన పాత ఇంటిని అన్ని సదుపాయాలతో రీమోడల్ చేయించింది- మామగారు అప్పుడప్పుడూ తన ఫ్రెండ్స్‌తో ఒకటిరెండు రోజులు గడిపేందుకు. ఆ పనితో కృష్ణకు అరవింద మీద ప్రేమ రెట్టింపైంది. అపుడు రెట్టింపైన ప్రేమ, గత వారం రోజులుగా అరవింద చేష్టలతో ఒక్కసారిగా జీరోకు పడిపోతోంది.

అందులో మొదటి స్టెప్- మామగారి అకౌంటులో తన పేరు కలిపి జాయింట్ అకౌంటుగా మార్చటం. తర్వాత- ఈనెల నుంచి అయిదువేలు అపార్ట్‌మెంటు లోను ఈఎంఐ కింద మామగారి పెన్షన్ అకౌంటు నుంచి ఆటోమేటిక్ ట్రాన్స్‌ఫర్ ఆప్షన్ పెట్టించటం. ఆయన కొచ్చేదే పదహారువేలు. ఆయనకు దానిని ఖర్చుపెట్టే అవసరం లేకపోవచ్చు. కానీ, ఒక జీవితకాలపు ఆయన శ్రమను ఇలా దోచుకోవటం, అదీ కూడా తనకీ విషయం వేరేవారి ద్వారా తెలియటం... ఇవన్నీ తలచుకుంటుంటే కృష్ణ మనసు ఉడికిపోతోంది.

'ఇల్లాలు ఇంటికి దీపం, కనబడే దైవం' అన్నీ దొంగ మాటలు. తల్లి అనే రోల్‌లో మాత్రమే స్త్రీ దేవత. అత్త, భార్య, కోడలు వంటి పాత్రలలో కాదు. పిల్లలు పుట్టగానే ప్రపంచాన్నంతా వాళ్ళకు దోచి పెట్టాలనే ఇన్‌స్టింక్టు దైవత్వమెలా అవుతుంది? గతంలో ఏదో టీవీ చర్చావేదికలో తను విన్న విశ్లేషణలు గుర్తొచ్చాయి. అప్పుడు ట్రాష్ అని కొట్టిపడేసినా, ఇప్పుడు మాత్రం అనుభవంలో అవన్నీ నిజమే అనిపిస్తోంది కృష్ణకు.

తండ్రిని పలకరించటానికి కూడా మనస్కరించక, కారు తీసుకుని నెల్లూరు బస్టాండు దగ్గర్లోని రత్నమహల్ హాలు వెనుక ఉన్న తన ఆడిట్ ఆఫీసుకు బయలుదేరాడు కృష్ణ. ఆదివారంనాడు ఆఫీసు దరిదాపుల్లో కూడా కనబడని తన బాస్ రాకను ఆశ్చర్యంగా చూస్తూ విష్ చేశాడు వాచ్‌మన్. దానిని పట్టించుకోకుండా తన రూమ్‌లో కెళ్ళి ఏసీ వేసుకుని టీవీ ఆన్ చేశాడు. ఏదో కొత్త సినిమా వస్తోంది ఓటీటీలో.



లడ్డూ బ్యాచ్‌ను పట్టుకునే ప్రయత్నంలో ఉండగా రిసార్ట్‌లో ఇద్దరు హత్య చేయబడ్డారని తెలుసుకుని వచ్చిన సీఐ తలుపులు బాది చివరకు కాలితో తన్నగానే రంధ్రం ఏర్పడి తలుపులో బూటు ఇరుక్కుపోతుంది. దానిని అతి కష్టంమీద బయటకు లాక్కుంటూ అవస్థలు పడుతుండగా, పక్కనున్న కానిస్టేబులు తీరిగ్గా కీతో తాళం తీసి లోపలికి వెళతాడు. కృష్ణ చూస్తున్నది దానిని కాదు. తర్వాత షాట్‌లో తెరుచుకుంటున్నపుడు తలుపులో ఆ రంధ్రం లేకపోవటాన్ని. తన తండ్రికి సినిమాలంటే ప్రాణం. ఆ అలవాటే తనకొచ్చింది. సినిమా విశ్లేషణలూ విమర్శలూ ఆస్వాదనలూ... మనసు బాలేనప్పుడు ఇవే తనకు రిలీఫ్ ఇచ్చేవి. ఇప్పుడవే నరకంగా అనిపించటంతో టీవీ ఆఫ్ చేసి కణతలు రుద్దుకున్నాడు.

పోయిన వారం వాకింగ్ తర్వాత వీధి చివరలో ఉన్న కిరాణాషాపు దగ్గర సిగరెట్ తీసుకుంటుంటే షాపతను "ఆ తెల్లగా ఒడ్డూ పొడుగుండే పంచెకట్టాయన మీ మామగారా?" అన్నాడు ఆసక్తిగా.

'ఇతను మా నాన్నను ఎప్పుడు చూశాడా' అనుకుంటూ... "దేనికి?" అన్నాడు అనుమానంగా.

"మేడమ్ గారు ఏవో సరుకులు కొనుక్కుని డబ్బులు మర్చిపోయానని నాతో అంటే, నేను 'ఫర్లేదమ్మా, తర్వాత ఇవ్వండి' అన్నాను. వెంటనే ఆ పెద్దాయన అయిదు వందల నోటు తీసి ఇచ్చాడు."

కృష్ణ కోపాన్ని కంట్రోల్ చేసుకుంటూ, "ఆయన మా నాన్నగారు" అన్నాడు.

అతను పట్టించుకోకుండా "అవునా, చిల్లర ఇస్తుంటే అంతటి ఆఫీసర్ మేడమ్ 'నాకు పెద్ద డైరీమిల్క్ కావాలి అనటం' ఆయన కూడా భళ్ళున నవ్వేసి 'నీకన్నానా తల్లీ' అనటం చూస్తుంటే తండ్రీ కూతుళ్ళు అనుకుంటారు ఎవరైనా" అన్నాడు మురిపెంగా.

ఆ షాపతని మాటలు గుర్తుకొస్తుంటే కృష్ణకు పుండు మీద కారం చల్లినట్టవుతోంది. డబ్బు... డబ్బు... డబ్బు... నలభైయేళ్ళు చెమటోడ్చిన ఫలితాన్ని అలా ఎలా దోచుకోవాలనిపిస్తుంది ఎవరికైనా? మనుషుల మరోకోణం పెద్ద పెద్ద మేధావులకే అర్థం కాదు. అరవింద దోపిడీ కిరాణాషాపు వాడికేం అర్థమవుతుంది? పోనుపోనూ భార్య మీద ద్వేషం రెట్టింపవుతోంది.

సెల్ మోగటంతో చూశాడు. 'ఫాదర్' అని డిస్‌ప్లే అవుతోంది. సెల్ తీసుకుంటుంటే కృష్ణ చేతులు వణికాయి. 'భార్యకూ తండ్రికీ మధ్య కచ్చితంగా వాగ్వివాదం జరిగి ఉంటుంది', ఏం చేయాలో పాలుపోక నిదానంగా సెల్ నొక్కాడు.

"చింటూగాడి బర్త్‌డేకి ప్రెజెంటేషన్ కొందామని బజారుకి వచ్చాం. ఆ బ్యాట్‌లూ బాల్‌లూ ఏ రకం కొనాలో తెలీటం లేదురా" తండ్రి గొంతులో కంగారు.

బిత్తరపోయాడు కృష్ణ. 'అర్థమైంది. వారం

క్రితం పడ్డ మూడోనెల పెన్షన్ ఒక్క రూపాయి కూడా మిగల్చకుండా మొత్తం కాజేద్దామని అరవింద ప్లాను. అందుకే తిన్న తర్వాత మధ్యాహ్నం తప్పనిసరిగా కునుకు తీసే నాన్నను బలవంతంగా ఇలా పంపించింది.'

కృష్ణలో టెన్షన్, ఆవేదన... క్రమక్రమంగా తీవ్రమైన కోపంగా మారిపోతోంది.

"ఏం చేయమంటావురా?" అన్న సెల్‌లో తండ్రి మాటకు ఉలిక్కిపడి "వాడికి తెలుసులే నాన్నా" అన్నాడు కోపాన్ని కంట్రోలు చేసుకుంటూ. కానీ, అతని వల్ల కాలేదు. భార్యమీద అసహ్యం ఆగ్రహంగా మారి కట్టలు తెంచుకోగా ఒక్కసారిగా లేచి ఆవేశంగా బయటపడ్డాడు.

వంటింట్లో స్నాక్స్ తయారుచేస్తున్న అరవింద, తనను జబ్బ పట్టుకుని ఎవరో లాగటంతో అదిరిపడింది. గోడకు కొట్టుకోబోయి తనను తాను కంట్రోల్ చేసుకుని ఆగి తలతిప్పి చూచింది. ఎదురుగా నిప్పులు కక్కే కళ్ళతో కృష్ణ. భర్తను భయంభయంగా చూస్తూ, "ఏమైంది?" అంది.

భార్యను తీవ్రంగా చూస్తూ "మా నాన్నను షాపింగ్‌కు ఎందుకు పంపావు... ఒక్క రూపాయి కూడా డబ్బులివ్వకుండా?" పెద్దగా అరుస్తున్నట్లు అన్నాడు కృష్ణ.

అరవింద తేలిగ్గా ఊపిరి పీలుస్తూ "అదా, ఇంకేమో అనుకుని భయపడ్డాను. ముందు వాటర్ తాగు. కూల్ అవుతావు" అని ఫ్రిజ్ నుంచి బాటిల్ ఇస్తుండగా కృష్ణ విసురుగా తల తిప్పుకున్నాడు.

అరవింద కృష్ణ భుజాల మీద చేతులు వేస్తూ, "ముందు నింపాదిగా కూర్చో" అంది.

కృష్ణ చేతులు విదిలించుకుంటూ, "నీ నటనలు ఆపు. మా నాన్నకు పడేదే పదహారువేలు. దానికీ ఎసరు పెట్టావా?" అన్నాడు రౌద్రంగా.

అరవింద కాసేపు మాట్లాడలేదు. తర్వాత నిదానంగా తలెత్తి, "నీకు ఆయన నాన్న... నాకు మామయ్య... స్వయానా మేనమామ. నాకు చిన్నప్పుడే తండ్రి చనిపోతే ఒంటిచేత్తో మా కుటుంబాన్ని పోషించిన నా మేనమామ. నాన్నకన్నా ఎక్కువ" అంది.


"అందుకేనా పైసా ఇవ్వకుండా చింటూనిచ్చి పంపావు. చింటూగాడు అక్కడ కనబడ్డవన్నీ కొంటాడు. ఆ కాస్త బ్యాలెన్స్ అయిపోయి, డబ్బుకట్టలేక నలుగురిలో మా నాన్న నవ్వులపాలు అయితేగానీ నీ కసి తీరదా?"

భార్య నవ్వటంతో కృష్ణ కోపం రెట్టింపై, "మాట్లాడవేం?" అని గద్దించాడు.

అరవింద చిరునవ్వుతో కృష్ణ భుజాలు నొక్కి కుర్చీలో కూర్చోబెడుతూ, "ప్రతి దీపావళికీ అమ్మా నేనూ మీ ఇంటికి వచ్చేవాళ్ళం, గుర్తుందా!? పట్టులంగాతో ఉన్న అయిదారేళ్ళ నన్ను ఎత్తుకుని కిరాణాషాపుకు తీసుకెళ్ళేవాడు మామయ్య. దారిలో కనబడ్డవారందరికీ 'నా మేనకోడలు' అని గొప్పగా చెప్పుకుంటూ, వాళ్ళు అబ్బురంగా చూస్తుంటే ఆనందపడుతూ, నన్ను అపురూపంగా చూసుకునేవాడు. 'మామయ్యను డబ్బులడిగి ఇబ్బంది పెట్టొద్దు' అన్న అమ్మ మాటలు గుర్తొచ్చి, నేను గుప్పిట్లో ఉన్న రూపాయిని గట్టిగా బిగిస్తూ 'మామయ్యా, టపాసులకు నువ్వు ఇవ్వొద్దు. నా డబ్బులతోనే కొనుక్కుంటా' అనేదాన్ని" బాల్య జ్ఞాపకాలవల్ల మొహం వెలుగుతుండగా అరవింద అంది.

కృష్ణ ఏం మాట్లాడలేదు. అరవింద కొనసాగించింది.

"కావల్సినవన్నీ కొనుక్కున్న తర్వాత కొట్టు తాతను, 'ఎంతైంది తాతా?' అని నేను అడిగితే... పక్కనుంచి మామయ్య, 'సరిగ్గా రూపాయే వుందా' అనేవాడు ఆ తాతకు కన్నుకొడుతూ. నడుం మీద చేయి వేసి అడుగుతున్న నా బుగ్గలు పుణికి పుచ్చుకుంటూ కొట్టు తాత కూడా 'అంతే అంతే, రూపాయికి ఒక్కపైసా తక్కువా లేదు ఎక్కువా లేదు' అనేవాడు. ఆ మందులన్నీ నేనే కొనుక్కున్నాననే నా అహాన్నీ ధీమానూ తగ్గకుండా చూసిన మామయ్యకు మనమేం ఇవ్వగలం- అవి తిరిగి ఇవ్వటం తప్ప"



అంది కళ్ళు తుడుచుకుంటూ.

జరుగుతున్నదంతా కృష్ణకు లీలగా అర్థమవుతూ కోపం, రౌద్రం క్రమేపీ తగ్గిపోసాగాయి. అయినా ఏదో గుర్తొచ్చి, కృష్ణ ఏదో అనబోయేంతలో అరవింద చెయ్యెత్తి ఆపుతూ, "నీ డౌట్ అర్థమైంది. ఆ షాపు మా ఫ్రెండ్ పల్లవిది. చింటూగాడు ఎంత షాపింగ్ చేసినా బిల్లు పదివేలకు ఒక్క రూపాయి తక్కువా ఉండదు, ఎక్కువా ఉండదు" అంది చిన్నప్పటి మామయ్య మాటలు అనుకరిస్తూ.

కృష్ణ మనసునిండా భార్యపట్ల కృతజ్ఞత చోటుచేసుకుంది. ఏదో సైకాలజీ బుక్‌లో చదివిన మాటలు గుర్తుకొచ్చాయి.

నేనొక్కడినే కుటుంబాన్ని నడపగలుగుతున్నాననే మగవాడి అహం, మేల్ ఇగో, క్రమేపీ ఆత్మవిశ్వాసంగా మారి అతన్ని సమర్థుడిగా స్థిరపరుస్తుంది. విజయాలు సాధించటంలేదనో విశ్రాంతి కావాలనో భార్యాపిల్లలు అతని మేల్ ఇగోని లాగివేసే చర్యలో భాగంగా, అదృశ్యంగా ఉన్న అతని ఆత్మవిశ్వాసమూ ఊడిపడుతుంది. అది అతణ్ని వ్యర్థుడిగా మార్చివేసి తనను తాను నిరుపయోగ వస్తువుగా భావించే స్థాయికి దిగజారుస్తుంది.

తన తండ్రిని ఆ ప్రమాదంలోంచి గట్టెక్కించి కోల్పోతున్న స్థానాన్ని తిరిగి ఇవ్వటం ద్వారా మేనమామలో కాన్ఫిడెన్సు ఊపిరులూదింది ఏ సైకాలజీ చదవని అరవింద.

భార్యను ప్రేమతో దగ్గరకు తీసుకోబోతుండగా చప్పుడు వినిపించి వాకిలివైపు తలతిప్పి చూశాడు. చింటూ ఒక్క అంగలో అరవింద దగ్గరకు దూకి చేతిలోని బొమ్మలూ బ్యాటూ బాలూ చూపిస్తూ గొప్పగా, "ఇవన్నీ తాతయ్యే కొనిచ్చాడు బర్త్‌డే ప్రజంటేషన్‌గా. షాపులో తాతయ్యతో సెల్ఫీ తీసుకుని మా ఫ్రెండ్స్‌కి పంపించాను కూడా" అన్నాడు గర్వంగా.

ఆ వెనుకగా మాధవరావు చేతిలో బ్యాగ్‌తో వస్తూ, "అల్లాడిచ్చాడురా నీకొడుకు! మొత్తం పదివేలు మించలేదనుకో, లేకపోతే నీకు ఫోన్ చేద్దామనుకున్నా" అంటూ, ఈ మధ్య తాను కొత్తగా కొన్న చిన్న ల్యాప్‌టాప్‌తో గదిలోంచి తన వద్దకు పరిగెత్తుకొచ్చిన మనవడిని ఆప్యాయంగా వెంటబెట్టుకుని తన రూమ్‌లోకి వెళ్ళాడు.

నాన్న చేయి మీసం మీదికి పోవటాన్ని చాలా రోజుల తర్వాత చూశాడు కృష్ణ. ఆయన మాటల్లో సంతోషం, గాంభీర్యం, హుందాతనం తొణికిసలాడుతున్నాయి.

"లెఫ్ట్‌హ్యాండ్ థంబ్, మిడిల్ ఫింగర్లతో ల్యాప్‌టాప్ మధ్యలో పైభాగాన్నీ అదే విధంగా రైట్‌హ్యాండ్‌తో కిందిభాగాన్నీ యూజ్ చేసి పైకి తెరవాలి. సైడ్ భాగాలతో కాదు. స్ప్రే డైరెక్ట్‌గా చల్లకూడదు. క్లాత్ మీద చల్లి తర్వాత తుడవాలి. అంతేకాదు, ఛార్జింగ్‌లో ఉన్నప్పుడు యూజ్ చేయకూడదు" శ్రద్ధగా వింటున్న మనవడికి వాడి భాషలో వాడికి అర్థమయ్యేట్లు వివరిస్తున్న మాధవరావు, ఏదో అలికిడి వినిపించి తలెత్తి చూశాడు.

ఎదురుగా ఏదో సంశయిస్తూ కృష్ణ.

"ఏరా, ఏం కావాలి?"

కృష్ణ ఏం మాట్లాడలేదు.

ఒళ్ళోని ల్యాప్‌టాప్ పక్కన పెడుతూ, "నా దగ్గర మొహమాటమేందిరా... డబ్బులేమైనా కావాలా?" అన్నాడు అనుమానంగా.


కృష్ణ చిన్న గొంతుతో, "ఓ అయిదు వందలు..." నసుగుతుంటే ఆయన ఫక్కున నవ్వేసి, "ఈ మాత్రం దానికేనా ఇంత బిల్డప్, తీసుకో" అని రెండు అయిదువందల నోట్లు ఇచ్చాడు.

వంటగదిలోంచి నవ్వు వినిపించి తల తిప్పిన మాధవరావు, "చూశావా వింధా, లక్షలు సంపాదించే పెద్ద ఆడిటర్. ఆఫ్ట్రాల్ మామూలు పెన్షనర్ వద్ద డబ్బులు అడుగుతున్నాడు" అన్నాడు మీసం దువ్వుతూ.

అరవింద ముందుకు వచ్చి, "ఇదంతా అప్పుగానే మామయ్యా, జీతం రాగానే వడ్డీతో సహా కట్టాలని మీ అబ్బాయికి చెప్పండి" అంది పెద్దగా.

అందరి నవ్వులతో గదంతా ప్రతిధ్వనించింది. ★

వాళ్లవైపు తుపాకీ పేల్చి... స్పృహ కోల్పోయాను!





సదానంద్ దాతేది మహారాష్ట్ర. ఆ రాష్ట్రానికి డీజీపీ కాబోతున్నారు. మొన్నటిదాకా... నేషనల్ ఇన్వెస్టిగేషన్ ఏజెన్సీ (ఎన్ఐఏ)కి సారథిగా ఉన్న ఆయన్ని కేంద్రంపైన ఒత్తిడి తెచ్చి మరీ డీజీపీగా నియమించుకుంది మహారాష్ట్ర. 'అయితే మనకేమిటీ?' అంటారా... సదానంద్ ప్రస్థానంలో యువత నేర్చుకునే పాఠాలెన్నో ఉన్నాయి. ఒకప్పుడు పేపర్‌బాయ్‌గా పనిచేసినవారాయన. ఒంటరి తల్లికి సాయంగా తోటపనికెళ్లారు. ఐపీఎస్‌గా మారాక... 26/11 ముంబయి దాడుల్లో హీరోచితంగా పోరాడారు. ఖాకీ దుస్తుల మాటున మానవీయ విలువల్ని చాటిన ఆ ప్రస్థానం ఆయన మాటల్లోనే...

నవంబర్ 26... 2008. ముంబయి సౌత్‌లో కాల్పులు జరుగుతున్నాయని నాకు వైర్‌లెస్ సమాచారం అందింది. అది నా జ్యూరిస్‌డిక్షన్ కాదు... కానీ సమస్య తీవ్రత పెద్దదని ఊహించి నేను రంగంలోకి దిగాను. కాల్పులు జరుపుతున్నవాళ్లు ఎవరో, వాళ్ల దగ్గరున్న ఆయుధాలు ఎలాంటివో తెలుసుకునే అవకాశం కూడా మాకు లేదు. మా దగ్గరున్నవన్నీ లాఠీలు, చిన్న రివాల్వర్లు, పొడవాటి బ్యారెల్స్ ఉండే కార్బైన్‌లు... అంతే. నేను వెళ్లేటప్పటికి- దుండగులు ముంబయిలోని కామా ప్రసూతి ఆసుపత్రిలో తలదాచుకున్నారని తెలిసింది. అందులో 250 మంది గర్భిణుల్నీ బాలింతల్నీ శిశువుల్నీ కవచంగా వాడుకుని... కిందున్న పోలీసులపైన దాడులు చేస్తున్నారు. నాతో ఏడుగురు పోలీసు సిబ్బందే ఉన్నారు. నేను వాళ్లని గైడ్ చేస్తూ ఆసుపత్రిలోకి అడుగు పెట్టాను. అప్పటికే ఇద్దర్ని చంపి... మృతదేహాలని ద్వారం దగ్గర పడేశారు. టెర్రస్ పైకి వెళ్ళడం కోసం ఆరో అంతస్తుకి లిఫ్ట్‌లో చేరుకున్నాం. మరో పది మెట్లపైన డాబాకి తీసుకెళ్లే తలుపు... ఓరగా తెరిచి ఉంది. మా అలికిడి గ్రహించగానే వాళ్లు కాల్పులు మొదలుపెట్టారు. అప్పుడే... వాళ్ల దగ్గరున్నవి అత్యాధునిక ఆటోమేటిక్ ఆయుధాలనీ వాటితో పోల్చుకుంటే మా పోలీసుల దగ్గరున్నవి ఒట్టి డమ్మీ తుపాకులనీ అర్థమైంది. వెనకడుగంటూ వేస్తే ఆసుపత్రిలోని రోగులూ, డాక్టర్ల ప్రాణాలని దుండగులకి అప్పగించినట్లే అవుతుంది. దాంతో నేనే ముందుండి కాల్పులు జరిపాను. మా పైకి వాళ్లు ఓ గ్రనేడ్ విసిరితే... నా పక్కనున్న ఎస్ఐ మోరె చనిపోయాడు, మిగతావాళ్లందరూ తీవ్రగాయాలతో కూలిపోయారు. నా ఛాతీ, కుడికన్నూ దెబ్బతిని రక్తమోడుతోంది. చావోరేవో- మా పోలీసు బలగం వచ్చేలోగా దుండగుల్ని నిలువరించే తీరాలి. అలా 40 నిమిషాలు మా తుపాకులతో వాళ్లని ఆపగలిగాను. చివరికి నా కాళ్లదగ్గరే గ్రనేడ్ ఒకటి విసిరితే... ఆ ధాటికి ఎగిరిపడ్డాను. స్పృహ కోల్పోతున్నానని అర్థమైపోతోంది. అప్పుడు నా కళ్లముందు లీలగా ఇద్దరు వ్యక్తులు కదలాడటం కనిపించింది... వాళ్లవైపు తుపాకీ పేల్చి నేను ఒరిగిపోయాను. కళ్లు మూతపడుతుండగా... అప్పటిదాకాలేని ఓ ఆలోచన నన్ను కలవరపెట్టింది... 'నా బిడ్డలూ నాలాగే తండ్రిలేని పిల్లలుగా ఎదుగుతారా..' అన్న ఆలోచన అది!

మాది పుణె. అక్కడి శనివార్‌పేటలో నాన్న వసంత్ ఓ షోరూమ్‌లో చిరుద్యోగిగా ఉండేవారు. ఇంట్లో ముగ్గురం పిల్లలం. అన్నయ్య తర్వాత నేను, తర్వాత తమ్ముడు. నా పదో ఏటదాకా నాన్న బాగానే ఉన్నారు... ఆ తర్వాత అనారోగ్యానికి గురయ్యారు. నెలల తరబడి ఆసుపత్రిలోనే ఉండేవారు. నేను ఎనిమిదో తరగతి చదువుతున్నప్పుడు కన్నుమూశారు. ఆస్తిపాస్తులంటూ ఏమీ లేవు మాకు. వారంలో ఒకటీరెండురోజులే రెండుపూటలూ భోజనం చేసేవాళ్లం. దాంతో అమ్మ పనిమనిషిగా మారింది. చుట్టుపక్కల ఇళ్ళలో వంట పనులూ ఇంటి పనులూ అన్నీ చేసేది. ఉదయం ఏడింటికే వెళ్లి... సాయంత్రానికి వచ్చేది. పనిచేస్తున్న ఇళ్లలో ఇచ్చే ఆహారమే మాకు రాత్రి భోజనం. చదువులో ఎలా ఉన్నాసరే- క్రమశిక్షణా, మంచి నడవడికా తప్పనిసరి అనేది అమ్మ. విలువల్ని నేర్పిస్తూనే పెంచింది. మా అన్నయ్య ఇంటర్ చేస్తూ... ఓ ఇంట్లో తోటపనికి వెళ్లడం మొదలు పెట్టాడు. స్కూలు అయిన తర్వాత నేనూ తనతోపాటూ వెళ్లి పనిచేసేవాణ్ణి. ఆ బంగ్లా యాజమాని నేను బాగా చదువుతానని ఆదరణగా చూసేవాడు. ఆయన ద్వారానే నేను పేపర్‌బాయ్‌గా కుదిరాను. పుణెలోని స్వర్‌గేట్, శివాజీ నగర్ ప్రాంతాల్లోని పోలీసు క్వార్టర్స్‌లో పేపర్ వేసేవాణ్ణి. పోలీసువాళ్ల ఠీవినీ, ఆ దర్పాన్నీ కళ్లప్పగించి చూస్తుండేవాణ్ణి. అలా పేపర్‌బాయ్‌గా ఉదయం సైకిల్ మీద వెళుతూనే మ్యాథ్స్ ఫార్ములాల్ని మననం చేసుకునేవాణ్ణి. ఇంగ్లిషు పాఠాల్ని వల్లెవేస్తుండేవాణ్ని.

ఆడిటర్‌గా...

మా అమ్మ పడ్డ కష్టం ఫలితమేమో టెన్త్‌లో 75 శాతం మార్కులు తెచ్చుకున్నాను. ఇంటర్ నుంచే ట్యూషన్‌లు చెప్పడం ప్రారంభించాను. రోజూ పేపర్ వేస్తుంటాను కాబట్టి... వాటిని చదవడమూ అలవాటైంది. అది కాస్తా నన్ను పుస్తకపఠనం వైపు తీసుకెళ్లింది. సాహిత్యంపైన ఉన్న మక్కువ నన్ను వ్యాసరచన, వక్తృత్వ పోటీల్లో ఫస్టొచ్చేలా చేసింది. ఇంటర్ ముగించి బీకామ్‌లో చేరాను. మధ్యాహ్నం తర్వాత ఖాళీయే కాబట్టి... పుణెలోని డాక్టర్ పాఠక్ ఆసుపత్రిలో టెలిఫోన్ ఆపరేటర్‌గా కుదిరాను. ఐసీడబ్ల్యూఏ చేస్తే మంచి జీతం వస్తుందని అందులో చేరాను. ఏడాదిలో ముగించి అందర్నీ ఆశ్చర్యపరిచాను! ఓ ఆడిటింగ్ కంపెనీలో ఉద్యోగం వచ్చింది. అప్పట్లో నాకు ప్రభుత్వ ఉద్యోగాలపైన సదభిప్రాయం ఉండేది కాదు... అక్కడ అవినీతి ఎక్కువని నమ్మేవాణ్ని. అలాంటిది

మా ఆడిటింగ్ సంస్థ కార్పొరేట్ కంపెనీల పన్ను ఎగవేతని 'అడ్జెస్ట్ చేయడం' చూసి భరించలేకపోయాను. గొడవపెట్టుకున్నాను. మా కాలేజీ ప్రొఫెసర్ దగ్గర నా బాధ వెళ్లగక్కితే 'నువ్వు నిజాయతీగా న్యాయబద్ధంగా ఉండాలనుకుంటే ప్రభుత్వ అధికారిగా వెళ్లు. అక్కడ నీ పద్ధతి మరీ నచ్చకపోతే... బదిలీ మాత్రమే చేయగలరు. అదే ప్రైవేటు ఉద్యోగంలో డిస్మిస్ చేసి పొట్టకొడతారు' అని చెప్పారు. అది నాకు పెద్ద కనువిప్పుగా మారింది. ఆ ఉద్యోగం మానేసి... ఎప్పట్లాగే పేపర్‌బాయ్‌గా వెళుతూ సివిల్స్‌కి ప్రిపేర్ అయ్యాను. ఏడాదిలోనే క్లియర్ చేసి... ఐపీఎస్‌ని అయ్యాను.

ఆరు బదిలీలు!

నా తొలి పోస్టింగ్ మహారాష్ట్రలోని రత్నగిరిలో. ఏసీపీగా కొలువుతీరిన రోజే... కార్యాలయం చుట్టూ మహిళలు గుమికూడి ఉన్నారు. అందరిదీ ఒకే ఫిర్యాదు- ఆ ప్రాంతంలోని జూదగృహాల్నీ, బెట్టింగ్ సెంటర్లనీ మూసేయాలీ అని. నా పరిధిలోని ఎనిమిది స్టేషన్ల ఇన్‌స్పెక్టర్‌లని కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించాను. మూడో రోజు చూస్తే... ఎవరూ ఏ చర్యలూ తీసుకోలేదని తెలిసింది. గట్టిగా నిలదీస్తే... 'మాకు ఎస్పీగారి ఆదేశాలు వేరేగా ఉన్నాయండీ!' అన్నారు నర్మగర్భంగా. నాకు చాలా కోపం వచ్చింది. నేనే దగ్గరుండి జూదగృహాలన్నీ మూసేయించాను! ఫలితం... డ్యూటీలో చేరిన ఆరోరోజే వార్ధాకి బదిలీ అయింది! వార్ధా మహాత్మాగాంధీతో ముడిపడిన ఊరు... కాబట్టి మద్యనిషేధం అక్కడ తప్పనిసరి. నేను దాన్ని స్ట్రిక్ట్‌గా అమలుచేయడం మొదలుపెట్టాను. ఓ రోజు నేను తనిఖీకని వెళ్లిన పోలీసు స్టేషన్ ముందు... ఓ పెద్దాయన ఏడుస్తూ కనిపించాడు. 'నా కొడుకు పీజీ చదివినవాడండీ. పోలీసులు అన్యాయంగా వాడిపైన కేసులు పెట్టారు. విడిపించాలంటే ఐదొందలు అడుగుతున్నారు... నా దగ్గర ఆ డబ్బులేదు' అన్నాడు. నేను లోపలికెళ్లి ఆ కుర్రాడిని విడిపించాను... అతని తండ్రిదగ్గర ఫిర్యాదు తీసుకుని కానిస్టేబుల్‌ని సస్పెండ్ చేశాను. రెండోరోజే నాకు మెమో వచ్చింది... ఆ కానిస్టేబుల్‌ని ఏ ఫిర్యాదూ లేకుండా సస్పెండ్ చేశాను అన్నది ఆరోపణ. ఆ పీజీ కుర్రాడి తండ్రి ఫిర్యాదు చేశాడుకదా... అతణ్ణి పిలిపించాను. 'ఆ కానిస్టేబుల్ మా కులంవాడట. అందువల్ల కంప్లైంటు వెనక్కి తీసుకున్నాను' అని అతను అంటుంటే... నా తల తిరిగిపోయింది. అలా వార్ధా నుంచీ బదిలీ కావాల్సి వచ్చింది. ఈ రకంగా ఏడాదిలోనే ఆరు ట్రాన్స్‌ఫర్‌లు. ఓసారి ఓ జిల్లాకి బదిలీ అయితే అదేరోజు నన్ను అక్కడి రాజకీయనాయకులు వేరే ప్రాంతానికి బదిలీ చేయించిన సందర్భమూ ఉంది! అయినా సరే, నేను నమ్మిన విలువల్ని వదులుకోలేదు... ఎక్కడా రాజీపడలేదు. ఎక్కడికి వెళ్లినా రోజులో 15 గంటలు పనిచేసేవాణ్ణి. ఏ చిన్న పొరపాటూ జరగకుండా చూసుకునేవాణ్ణి. బహుశా ఆ లక్షణాలే నన్ను చిన్న వయసులోనే భండారా జిల్లాకి ఎస్పీని చేశాయి.

'ఎన్‌కౌంటర్ చెయ్'


భండారా నక్సల్స్ ప్రభావిత ప్రాంతం. ప్రజాస్వామ్యాన్ని నమ్మకపోవడం, తుపాకులతోనే రాజకీయ మార్పు తేవాలనుకోవడం సరికాదనే తప్ప నక్సలిజం సిద్ధాంతంతో నాకే సమస్యా లేదు. అందుకే నకిలీ ఎన్‌కౌంటర్ చేయడం అమానవీయమని బలంగా నమ్మాను. దేశంలోనే తొలిసారి- నక్సల్స్ లొంగిపోవచ్చని పిలుపునిచ్చాను. ఓ వారం తర్వాత ముఖ్య దళనాయకుడైన శివాజీ తుమ్‌రెడ్డి, అతని భార్య సునీతా నా దగ్గరకి వచ్చారు. వాళ్ల ఏకే 47లని అప్పగించి లొంగిపోతే చాలా సంతోషించాను. నేను ఆ విషయం మా డీఐజీకి చెబితే 'అతణ్ణి ఇప్పుడే ఎన్‌కౌంటర్ చెయ్' అన్నాడు. నేను కుదరదని చెప్పి చట్ట ప్రకారమే కోర్టుకి అప్పగించాను. మాట ఇచ్చినట్టే ఆ కుటుంబానికి పునరావాసం కల్పించాను. అది అప్పట్లో సంచలనం సృష్టించింది. అంతేకాదు... అక్కడే పోలీసు సంస్కరణలకి తెరలేపాను. తాగుడు మాన్పించాలనుకున్నాను. మొబైల్ డీ-అడిక్షన్ కేంద్రాల్ని ఏర్పాటుచేసి ఎంతోమందిని తాగుడు మానేలా చూశాను. 'నా భర్త దొంగల్ని కొట్టడం మాట ఏమోకానీ... తాగొచ్చి నన్ను చితకబాదుతుంటాడు. మీవల్ల పూర్తిగా మారిపోయాడు' అని ఎంతోమంది మహిళలు నా దగ్గరకొచ్చి ఆనందాన్ని పంచుకున్నారు. భండారా తర్వాత ముంబయి నగరానికి పదోన్నతిపైన డీసీపీగా వచ్చాను. దేశంలోని అతిపెద్ద మురికివాడైన ధారావి ప్రాంతంలో శాంతిభద్రతల పరిరక్షణ కోసం శాయశక్తులా కృషిచేశాను. నా సేవలగ్గాను 2007లోనే రాష్ట్రపతి పతకం అందుకున్నాను. సీబీఐలోనూ పనిచేశాను. దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన తెల్గీ స్టాంపుల కుంభకోణంపైన దర్యాప్తు అధికారిగా ఉన్నాను. ఆ తర్వాత అడిషనల్ కమిషనర్‌గా ముంబయి- సెంట్రల్ విభాగం బాధ్యతలు తీసుకున్నాను. అప్పుడే ముంబయి దాడులు జరిగాయి.

దుండగులు విసిరిన గ్రనేడ్ గాయాలతో... నాలుగురోజుల తర్వాతే ఆసుపత్రిలో కళ్లు తెరిచాను. నేను ఆ రోజు ఎదుర్కొంది అజ్మల్ కసబ్‌నూ అతని గురువు ఇస్మాయిల్ ఖాన్‌నూ అని అప్పుడే తెలిసింది. నేను చివరిగా కాల్చిన బుల్లెట్ ఇస్మాయిల్ ఖాన్ నడుంలో దిగబడి అతని మరణానికి కారణమైంది. అజ్మల్ కసబ్ పోలీసులకి దొరికాడు. నాకు మరోసారి రాష్ట్రపతి పతకం వచ్చినా... ముంబయి పోలీసుల పరిస్థితిని మార్చేదాకా నిద్రపట్టలేదు. మామూలు పోలీసులూ ఉగ్రవాదుల దాడుల్ని ఎదుర్కోగలిగేలా 'ఫోర్స్ వన్' బృందాన్ని ఏర్పాటుచేశాను. అడుగడుగునా యాంటీ టెర్రరిజం సెల్(ఏటీసీ)లని నెలకొల్పాను. ఇవి రెండూ తర్వాతి కాలంలో దేశం మొత్తానికీ మార్గదర్శకంగా మారాయి. గత ఏడాది నేషనల్ ఇన్వెస్టిగేషన్ ఏజెన్సీ(ఎన్ఐఏ)కి డైరెక్టర్-జనరల్‌గా వెళ్లాను!

అతణ్ని రప్పించాం...

26/11 ముంబయి దాడులు ప్రజల జ్ఞాపకాల్లో మరుగునపడుతున్నా... దర్యాప్తు అధికారులుగా మా పని ఇంకా పూర్తికాలేదు. ఆ దాడుల వ్యూహకర్త తహవూర్ రాణా అమెరికాలో తలదాచుకుంటే... అక్కడి సుప్రీంకోర్టుని ఒప్పించి ఇటీవల అతన్ని ఇండియాకి తీసుకురావడం... ఎన్ఐఏ సాధించిన పెద్ద విజయం! ఆ సంతృప్తితోనే ఇప్పుడిలా మహారాష్ట్ర డీజీపీగా బాధ్యతలు తీసుకుంటున్నాను.

ఒకప్పుడు పుణె పోలీసు క్వార్టర్స్‌లో పేపర్ వేసే రోజుల్లో ఇలా... మహారాష్ట్ర పోలీసు వ్యవస్థ మొత్తానికీ సారథ్యం వహిస్తానని కలగన్నది లేదు. అది సాధ్యం చేసింది కేవలం నా సామర్థ్యమని నేను అనుకోవడం లేదు. నా విలువలే నన్ను ఉన్నతంగా నిలిపాయి. వాటిని నాలో నింపింది ఒంటిచేత్తో నన్ను పెంచిన మా అమ్మ ప్రేమా, ప్రపంచ జ్ఞానాన్ని నాకు పంచిన పుస్తకాలూ... మాత్రమేనని అనుకుంటా. వాటికెప్పుడూ కృతజ్ఞతలు చెప్పుకుంటా! ★





అగ్నిపర్వతాలే వాళ్లకు ఆదాయ వనరులు!

ఐస్‌లాండ్... పేరుకు తగ్గట్టే మంచు దుప్పటిని కప్పుకుని అత్యంత అందంగా ఉంటుందీ దేశం. కానీ, ఇది ఒకవైపే... మరోవైపు, వందలకొద్దీ అగ్నిపర్వతాలు శిలాద్రవంతో నిత్యం నిప్పుల వర్షం కురిపిస్తుంటాయిక్కడ. ఒకప్పుడు ఐస్‌లాండ్‌ని ఇబ్బంది పెట్టిన ఈ రాకాసి అగ్నిపర్వతాలే, ఇప్పుడా దేశాన్ని 100 శాతం రెన్యువబుల్ ఎనర్జీ సాధించిన దేశంగా, వెజిటబుల్ ప్యారడైజ్‌గా మార్చేశాయి. అదెలాగంటే...





ఐస్‌లాండ్... ఇక్కడ వేసవికాలంలో ఉష్ణోగ్రత మహా అయితే ఏడెనిమిది డిగ్రీలు దాటదు. ఆ తర్వాత అంతా జీరో డిగ్రీలకు అటూఇటూగా ఉండే చల్లదనమే! గడ్డకట్టే ఆ చలిలో ఇక్కడి మనుషులు ఏం తింటారు, ఎలా బతుకుతారు అనే సందేహం వస్తుంది కదా? ఒకప్పుడు అయితే చేపలు పట్టడం, పశువుల పెంపకంపైనే ఇక్కడి ప్రజలు ఆధారపడేవారు. ఆహారం, ఇంధనం ఏది కావాలన్నా బోలెడు ఖర్చుపెట్టి ఇతర దేశాల నుంచి దిగుమతి చేసుకోవాల్సిందే. అందుకే 2000 సంవత్సరం వరకూ ఐస్‌లాండ్ పేదదేశంగానే మిగిలింది. కానీ ఇప్పుడు కాదు... ప్రస్తుతం ఇక్కడున్న ఒక్కో వ్యక్తి సగటు ఆదాయం దాదాపుగా కోటి రూపాయలు. అంతేకాదండోయ్... నాలుగు లక్షల జనాభాఉన్న ఈ దేశం మానవాభివృద్ధి సూచికలో మొదటి స్థానంలో నిలిచింది. అరె... ఇదంతా ఎలా సాధ్యమైంది అనిపిస్తోంది కదా! ఇక్కడున్న అగ్నిపర్వతాలే అందుకు కారణం. అవును, చల్లగా ఉండే ఈ దేశం అగ్నిపర్వతాల నిలయం కూడా. చిన్నాచితకా కలిపి ఇక్కడ 200 అగ్నిపర్వతాలుంటే, వాటిలో చాలామటుకు లావాని ఎగజిమ్ముతూ భయపెట్టేవే. అవేనా, 600 వరకూ వేడినీటిబుగ్గలు కూడా ఉన్నాయి. అందుకే ఈ దేశాన్ని 'లాండ్ ఆఫ్ ఐస్ అండ్ ఫైర్' అంటారు. భిన్నమైన ఈ వాతావరణ పరిస్థితుల్నే, టెక్నాలజీ సాయంతో తమకు అనుకూలంగా మార్చుకున్నారు ఇక్కడి ప్రజలు. అగ్నిపర్వతాలకు దగ్గర్లో వేడి నీటి బుగ్గలు ఎగజిమ్మే ఆవిర్లని ఒడిసిపట్టి, దాంతో 'జియోథర్మల్ పవర్'ని తయారుచేసుకోవడం మొదలుపెట్టారు. భూమిలోంచి సహజంగా వచ్చే వేడి నీటినీ, ఆవిరినీ గొట్టాల్లోకి పంపించి, టర్బైన్ల సాయంతో జియోథర్మల్ పవర్‌ని తయారుచేస్తారు. విద్యుత్తు తయారుచేయగా మిగిలిన వేడినీటిని పైపులూ, గొట్టాల ద్వారా ఇళ్లకు మళ్లిస్తారు. 95శాతం ప్రజలు ఇళ్లను వెచ్చగా ఉంచడానికి ఈ నీటినే వాడుతున్నారు. ఇంకా, మిగిలిన నీటిని స్విమ్మింగ్ పూల్స్‌ని వేడిచేయడానికీ, రోడ్లపైన పోగుపడ్డ మంచుని తొలగించడానికీ వాడుతుంటారు. దేశం మొత్తానికి కావాల్సిన విద్యుత్తులో 40శాతం జియోథర్మల్‌పవర్ నుంచీ, మిగిలినది హైడ్రోపవర్ నుంచీ తయారుచేసుకుంటున్నారు. ఇతర దేశాల మాదిరిగా ఇంధన అవసరాల కోసం బొగ్గు, పెట్రోల్ వంటివాటిపైన ఆధారపడటం మానేశారు. వందశాతం రెన్యువబుల్ విద్యుత్తుని సాధించి ప్రజలకు నామమాత్రపు ధరలకే పవర్‌ని అందిస్తున్నారు.

గ్రీన్‌హౌసుల్లో పండించేస్తున్నారు...

ఇక్కడ- అయితే మంచూ, లేకపోతే అగ్నిపర్వతాలు ఎగజిమ్మిన నల్లటి బూడిదా తప్ప పంటలు పండించేంత అనుకూలమైన నేలలు ఉండవు. మహా అయితే దేశం మొత్తం మీద ఒక్కశాతం సారవంతమైన నేల ఉంటుందేమో. అందుకే తమకు కావాల్సిన ఆహారాన్ని ఎంతో ఖర్చు పెట్టి ఇతర దేశాల నుంచి దిగుమతి చేసుకునేవారు. కానీ ఇప్పుడా పరిస్థితికీ వేడినీటితో చెక్ పెట్టేశారు ఐస్‌లాండ్ వాసులు. అదెలా అంటే- విద్యుత్తు తయారుచేయగా మిగిలిన వేడినీటిని పైపుల



ద్వారా గ్రీన్‌హౌస్‌లకు మళ్లించి అక్కడ ఏడాది పొడవునా ఒకేరకమైన వాతావరణం ఉండేట్టు మైక్రో క్లైమాట్స్‌ని ఏర్పాటు చేస్తున్నారు. టొమాటోలు, దోసకాయలు, బంగాళాదుంపలు, క్యాబేజీ, క్యారట్, బీట్‌రూట్, మిర్చి, క్యాప్సికమ్, ద్రాక్షలతోపాటు ఆశ్చర్యంగా అరటితోటలనీ ఈ గ్రీన్‌హౌస్‌లలో పండించేస్తున్నారు. శీతకాలంలో ఇక్కడ మరీ చీకటిగా ఉంటుంది. అప్పుడు కూడా కృత్రిమ లైట్ల కాంతిలో పుట్టగొడుగులు, నాచు వంటివి సాగుచేస్తున్నారు. ప్రపంచం నలుమూలల నుంచీ ఇక్కడి ప్రకృతి అందాలు చూడ్డానికి వచ్చే పర్యటకులకు ఈ గ్రీన్‌హౌస్‌లలోని పంటల మధ్యనే భోజనాలు కూడా వడ్డించేస్తున్నారు. 'ఫార్మ్ టు టేబుల్' అనే కాన్సెప్ట్‌ని పక్కాగా అమలుచేసి చూపించేస్తున్నారు. ఇక్కడున్న చలి కారణంగా పంటలకు చీడపీడలు కూడా పట్టకపోవడం మరొక విశేషం. దీంతో ఇక్కడ పండే నాణ్యమైన పంటలకి డిమాండ్ కూడా బాగానే పెరుగుతోంది. అందుకే ఈ దేశాన్ని వెజిటబుల్ ప్యారడైజ్ అని పిలుస్తున్నారు. అంతేనా, ప్రపంచంలో ఎవరికి జియోథర్మల్ టెక్నాలజీ కావాల్సి వచ్చినా ఇక్కడి నుంచే సేవలు అందిస్తూ ఆ రకంగానూ ఆదాయాన్ని పొందుతున్నారు. బాగుంది కదూ... అందరినీ భయపెట్టే అగ్నిపర్వతాలు వీళ్లకిలా ఆదాయ వనరుగా మారడం! ★



రుచి అభిరుచి


క్రిస్మస్‌వేళ... కమ్మని విందు!

నక్షత్ర కాంతుల మధ్య ఏసుక్రీస్తును స్వాగతించే శుభవేళ... విందూ అదిరి పోవాల్సిందేగా. ఈసారి ఆ వంటకాల్లో కేకుతోపాటు ఇంకేం చేయాలా అని ఆలోచిస్తుంటే, వీటిని చేర్చి చూడండి.

డ్రైఫ్రూట్స్ మావా కేక్

కావలసినవి: ఉప్పు కలపని వెన్న: ఏడు టేబుల్‌స్పూన్లు, **చక్కెర:** కప్పు, **కోవా తురుము:** అరకప్పు, **యాలకులపొడి:** చెంచా, **గుడ్లు:** రెండు, **మైదా:** ఒకటింబావు కప్పు, **బేకింగ్‌పౌడర్:** అరచెంచా, **పాలు:** ఏడు టేబుల్‌స్పూన్లు, **పిస్తా పలుకులు:** పావుకప్పు, **బాదం పలుకులు:** రెండు టేబుల్‌స్పూన్లు.

తయారీ విధానం: ముందుగా అవెన్‌ను 350 డిగ్రీల ఉష్ణోగ్రతలో వేడి చేసుకుని పెట్టుకోవాలి. అలాగే కేక్‌పాన్‌కు కాస్త వెన్న రాసుకోవాలి. ఇప్పుడు ఓ గిన్నెలో మైదా, బేకింగ్‌పౌడర్, యాలకులపొడి వేసి అన్నింటినీ కలుపుకోవాలి. మరో గిన్నెలో వెన్న, చక్కెర తీసుకుని క్రీమ్‌లా అయ్యే వరకూ గిలకొట్టుకుని తర్వాత కోవా తురుము, గుడ్లసొన వేసుకుని మరోసారి కలిపి మైదా వేయాలి. అన్నింటినీ బాగా కలిపి ఈ మిశ్రమాన్ని కేక్‌టిన్‌లోకి తీసుకోవాలి. పైన పిస్తా, బాదంపలుకులు అలంకరించి అర గంటసేపు అవెన్‌లో బేక్‌చేసుకుని తర్వాత ముక్కల్లా కోసుకోవాలి.



పిన్‌వీల్ కుకీస్

కావలసినవి:

మైదా: కప్పు, **వెన్న:** అరకప్పు, **వెనిల్లా ఎసెన్స్:** చెంచా, **చక్కెరపొడి:** పావుకప్పు, **ఉప్పు:** పావుచెంచా, **చాక్లెట్‌చిప్స్:** పావుకప్పు.

తయారీ విధానం: వెన్న, చక్కెరపొడిని ఓ గిన్నెలో వేసుకుని బాగా గిలకొట్టుకోవాలి. ఈ మిశ్రమంలో మైదా, వెనిల్లా ఎసెన్స్ వేసి మరోసారి కలుపుకోవాలి. ఓ గిన్నెలో చాక్లెట్ చిప్స్ తీసుకుని డబుల్ బాయిలింగ్ పద్ధతిలో కరిగించుకోవాలి. అంటే... మరో గిన్నెలో సగంవరకూ నీళ్లు తీసుకుని స్టవ్‌మీద పెట్టాలి. అందులో చాక్లెట్ చిప్స్ ఉన్న కప్పును పెట్టి... కరిగించాలి. ఇప్పుడు కలిపి పెట్టుకున్న మైదా మిశ్రమాన్ని సమానంగా వేరు చేసుకుని ఒకదాంట్లో కరిగించిన చాక్లెట్‌ను కలిపి, రెండింటినీ ఫ్రిజ్‌లో పెట్టాలి. ఇరవై నిమిషాలయ్యాక బయటకు తీసి వీటిని విడివిడిగా మందపాటి చపాతీల్లా ఒత్తుకోవాలి. ఇప్పుడు వీటిని ఒకదానిపైన ఒకటి ఉంచి... రోల్‌మాదిరి చుట్టుకోవాలి. ఇలా చుట్టుకున్న రోల్‌ని ముక్కల్లా కోసి, కాస్త వెడల్పుగా చేసుకోవాలి. వీటిని 160 డిగ్రీల ఉష్ణోగ్రతలో అయిదు నుంచి పదినిమిషాలు అవెన్‌లో బేక్ చేసుకుని తీసుకోవాలి.



చికెన్ 65

కావలసినవి: బోన్‌లెస్ చికెన్: అరకేజీ, పెరుగు: రెండు టేబుల్‌స్పూన్లు, అల్లంవెల్లుల్లి పేస్టు: టేబుల్‌స్పూను, మిరియాల పొడి: చెంచా, జీలకర్రపొడి: చెంచా, గరంమసాలా: చెంచా, ఉప్పు: తగినంత, కారం: చెంచా, కశ్మీరీ కారం: టేబుల్‌స్పూను, నిమ్మరసం: చెంచా, గుడ్డు: ఒకటి, మొక్కజొన్నపిండి: రెండు టేబుల్‌స్పూన్లు, బియ్యప్పిండి: రెండు టేబుల్‌స్పూన్లు, నూనె: వేయించేందుకు సరిపడా, వెల్లుల్లి తరుగు: టేబుల్‌స్పూను, పచ్చిమిర్చి: మూడు, కరివేపాకు రెబ్బలు: రెండు.

తయారీ విధానం: ఓ గిన్నెలో చికెన్ ముక్కలు, పెరుగు, అల్లంవెల్లుల్లి పేస్టు, మిరియాలపొడి, జీలకర్రపొడి, గరంమసాలా, తగినంత ఉప్పు, కారం, కశ్మీరీకారం నిమ్మరసం వేసుకుని బాగా కలిపి పక్కన పెట్టుకోవాలి. మరో గిన్నెలో గుడ్డులోని తెల్లసొన, మొక్కజొన్నపిండి, బియ్యప్పిండి వేసుకుని కలుపుకోవాలి. అరగంట అయ్యాక చికెన్ ముక్కల్ని గుడ్డు మిశ్రమంలో ముంచి, కాగుతున్న నూనెలో వేసి కరకరలాడేలా వేయించుకుని తీసుకోవాలి. ఇప్పుడు కడాయిలో టేబుల్‌స్పూను నూనె వేసి.. వెల్లుల్లి తరుగు, నిలువుగా చీల్చిన పచ్చిమిర్చి, కరివేపాకు వేయించుకుని చికెన్‌ముక్కల్ని వేసి రెండు నిమిషాలు వేయిస్తే నోరూరించే చికెన్ 65 రెడీ.



అరటికాయ స్వీట్ చిప్స్

కావలసినవి: **అరటికాయలు:** ఆరు, **బెల్లం తురుము:** ఒకటీ ముప్పావుకప్పు, **చక్కెర:** ఒకటిన్నర టేబుల్‌స్పూను, **శొంఠిపొడి:** అర చెంచా, **బియ్యప్పిండి:** మూడు టేబుల్‌స్పూన్లు, **యాలకులపొడి:** చెంచా, **జీలకర్రపొడి:** అరచెంచా, **నూనె:** వేయించేందుకు సరిపడా.

తయారీ విధానం: అరటికాయల చెక్కు తీసి కాస్త పెద్ద ముక్కల్లా కోసి ఉప్పు నీటిలో వేసుకోవాలి. పది నిమిషాలయ్యాక ఈ ముక్కల్ని నూనెలో వేసి ఎర్రగా వేయించుకుని తీసుకోవాలి. ఇప్పుడు స్టవ్‌మీద కడాయిని పెట్టి పావుకప్పు నీళ్లు, బెల్లం తరుగు వేయాలి. బెల్లం కరిగి, ముదురుపాకంలోకి మారుతున్నప్పుడు మిగిలిన పదార్థాలను ఒక్కొక్కటిగా వేసుకుని అన్నింటినీ కలిపి స్టవ్‌ని సిమ్‌లో పెట్టాలి. అరటికాయ ముక్కలకు పాకం పట్టి, చిప్స్ మాదిరి తయారయ్యాక దింపేయాలి. ఇవి పదిరోజులవరకూ నిల్వ ఉంటాయి.



తప్పులే తప్పులు

పిల్లలంతా స్కూల్ బస్ కోసం ఎదురుచూస్తున్నారు కదూ! ఈ బొమ్మలో అయిదు తప్పులు ఉన్నాయి. అవేంటో కనిపెట్టగలరా?




అది ఏది?

బయటికెళ్లిన అమ్మావాళ్లు తిరిగి వచ్చేలోగా, కుకీస్‌తో క్రిస్మస్ ట్రీని డెకరేట్ చేసి వాళ్లను ఆశ్చర్యపరచాలనుకుంది పింకీ. ఆ హడావుడిలో ఒక కుకీని మర్చిపోయింది. అది ఏదో మీకు తెలిసిందా?




ఆటాడుకుందాం రా...



ఇక్కడ కొన్ని ఆకారాలూ, అక్కడక్కడా ఖాళీలూ ఉన్నాయి. అడ్డంగా, నిలువుగా ఎటుచూసినా ఒక బొమ్మ ఒకసారే వచ్చేలా ఆ ఖాళీలను నింపగలరా?

దారి కనుక్కోండి

సముద్రంలో ప్రయాణిస్తున్న వ్యక్తికి తీరమెక్కడుందో తెలియడం లేదు. మీరేమైనా దారి చూపి, అతడికి సాయం చేయగలరా?



తేడాలేంటి?

ఈ రెండు బొమ్మల మధ్య ఎనిమిది తేడాలున్నాయి. అవేంటో కనిపెట్టండి.





కష్టం పిల్లులది.. లాభం నక్కది!

ఓ అడవిలోని నది ఒడ్డున రెండు నీటి పిల్లులు నివసిస్తుండేవి. అవి ఎంతో స్నేహంగా ఉండేవి. నదిలోకి దిగి, చేపల వెంట ఈదుతూ వాటిని ఒడ్డుకు తరుముకొచ్చి చంపి తినేసేవి. కానీ, అలా ఒక్కో




చేపను చంపి, మళ్లీ నదిలోకి వెళ్లడం కష్టం కావడంతో ఓ ఆలోచన చేశాయా పిల్లులు. ఒకటి చేపలను ఒడ్డుకు తరిమితే.. మరొకటి అలా ఒడ్డుకు చేరిన వాటిని చంపాలనే అంగీకారానికొచ్చాయి. అలా ఆ రెండూ కలిసి బోలెడన్ని చేపలను పట్టుకోగలిగాయి. ఇక పంచుకోవడమే తరువాయి. 'మిత్రమా.. ఈ చేపలను రెండు కుప్పలు చెయ్యి' అంది ఒడ్డునున్న పిల్లి. పొరపాటున దానికి ఎక్కడ అన్యాయం చేసేస్తానో అని భయపడి, 'లేదు మిత్రమా.. నువ్వే పంచు' అంది రెండోది. మొదటి దానికీ అదే భయం. దాంతో చేపలను మధ్యలో పెట్టుకొని దిగాలుగా కూర్చున్నాయవి. ఇంతలో ఆహారాన్ని వెతుక్కుంటూ అటుగా వచ్చిందో నక్క. పిల్లులను పలకరించి, విషయం అడిగి తెలుసుకుంది.

'ఓస్ అంతేనా.. మీకీ చేపలను న్యాయంగా నన్ను పంచమంటారా?' అడిగింది నక్క. తమ చిక్కు తొలగిపోతుందనుకుంటూ సరేనన్నాయవి. ఓ నీటి పిల్లిని కాస్త పక్కకు తీసుకెళ్లిన నక్క.. 'నీ మిత్రుడే ప్రవాహానికి ఎదురీది మరీ నేర్పుగా చేపలను ఒడ్డుకు తరిమింది. ఒడ్డుకొచ్చిన చేపలను చంపడం తప్ప నువ్వు చేసిందేమీ లేదు కాబట్టి నీకు రావాల్సిన వాటా చాలా తక్కువ. అందువల్ల చేపల తల భాగం మాత్రం నువ్వు తీసుకో' అంది. తర్వాత రెండో పిల్లినీ దూరంగా పట్టుకెళ్లి, 'సునాయాసంగా చేపలను ఒడ్డుకు తరిమిన నీకంటే.. రాళ్లూ, రప్పల్లో తంటాలు పడి మరీ వాటిని చంపిన నీ మిత్రుడి కష్టమే ఎక్కువ. అందువల్ల చేపల తోక భాగం మాత్రం నువ్వు తీసుకో' అంది. ఆ మాటలకు రెండు పిల్లులూ దిగాలుగా సరేనన్నాయి. తర్వాత నక్క- చేపలన్నింటి తలలూ, తోకలూ కత్తిరించింది. ఒకదానికేమో తలలూ, మరోదానికేమో తోకలూ పంచి.. మధ్యవర్తిత్వం చేసినందుకు చేపల మధ్య భాగాలను తీసుకొని ఎంచక్కా వెళ్లిపోయింది. అప్పటికిగానీ నీటి పిల్లులకు జిత్తులమారి నక్క చేసిన మోసం అర్థం కాలేదు. ఆ తర్వాత అవెప్పుడూ పంపకాల జోలికి పోలేదు. రెండూ కలిసి వేటాడి ఆకలేసినన్ని తిని మిగతావి మర్నాటికి దాచుకోసాగాయి.

చెప్పగలరా?

పిల్లలంతా సరదాగా టూర్‌కెళ్తున్న ఈ చిత్రంలో ఆంగ్ల అక్షరం 'C'తో మొదలయ్యే అంశాలూ, వస్తువులూ కొన్ని ఉన్నాయి. అవేంటో చెప్పండి మరి!



కనిపెట్టగలరా?

లలిత కోసమని వాళ్ల నాన్న రకరకాల బిస్కెట్ ప్యాకెట్లు తీసుకొచ్చాడు. తనకేమో వాటిల్లో ఒక్కటి మాత్రమే నచ్చింది. ఇచ్చిన ఆధారాల సాయంతో ఆ ఒక్కటి ఏదో కనుక్కోగలరా?



- ఓపెన్ చేసి లేదు
- నక్షత్రాలు కాకుండా ఏదో ఒక డిజైన్ ఉండాలి.
- నాలుగుకంటే తక్కువ రంగులుండాలి.
- అంకెలుంటే నచ్చదు.

రంగులేద్దాం



జవాబులు

తేడాలేంటి?: 1. రీడింగ్ ల్యాంప్ 2. చిన్న టెడ్డీ బేర్ చేయి 3. బ్యాట్ దిశ 4. కుక్క స్థానంలో పిల్లి 5. అద్దం స్థానం 6. పుట్టగొడుగు 7. కుడి వైపునున్న ల్యాంప్‌పైన డిజైన్ 8. పాప టీషర్టు రంగు. **కనిపెట్టగలరా?:** 5


తప్పులే తప్పులు: 1. స్ట్రీట్ లైట్‌లో దీపానికి బదులుగా అక్వేరియం 2. బస్సుపైన స్కూల్ స్పెల్లింగ్ 3. కుక్కకు ఒక కాలు లేదు 4. మంచు ప్రాంతాల్లో మాత్రమే నివసించే ధ్రువపు ఎలుగుబంటి అక్కడ ఉండటం 5. బస్‌స్టాప్ బోర్డు మీద ఆటో బొమ్మ.

అది ఏది?




చెప్పగలరా?: Clock, Crown, Camera, Clouds, Crow, Cap, Cat, Car.

ఆటాడుకుందాం రా...



సమీక్ష

రంగుల కలలు




మణి వడ్లమాని ‘అసంగత’ సంకలనంలోని చాలా కథల్లో ... పాత్రలు సంభాషించుకునేది తక్కువ, వాటి హృదయాలు చర్చించుకునేదే ఎక్కువ. రంగులు మనుషుల్లా ప్రవర్తిస్తాయి, మనుషుల్లో వర్ణాల ఛాయలు గోచరిస్తాయి. సందర్భాన్ని బట్టి సముద్రం కథానాయకుడి అవతారం ఎత్తుతుంది. ఆ సంద్రం గుండెల్లో దాగిన రహస్యాల్ని అలలు బయటపెడతాయి. ‘లైఫ్ ఈజ్ ఫుల్ ఆఫ్ కాంట్రడిక్షన్స్’ అన్న వాదన పాత్రల గొంతుకల్లో బలంగా వినిపిస్తుంది. కలలు నిజాల్లా, నిజాలు కలల్లా అనిపించే ఘట్టాలూ లేకపోలేదు. ‘వర్ణ’, ‘ఐ’, ‘రహస్య’, ‘స్పర్శ- ది టచ్’, ‘మరో తలుపు’... ఇలా ప్రతి కథ ప్రతీకాత్మకమే. ఆ రూపంలో పాఠకుడికి నిశ్శబ్ద భాషను పరిచయం చేసే ప్రయత్నమే.

అసంగత
రచన: మణి వడ్లమాని
పేజీలు: 86, వెల: రూ.120
ప్రతులకు: ప్రధాన పుస్తక కేంద్రాలు.


నాడూ నేడూ...

రాజా కాలస్య కారణం... అంటాడు చాణక్యుడు. రాష్ట్రానికి సంబంధించి ముఖ్యమంత్రే మహారాజు. ఆ నేలపైన జరిగే మంచి చెడులకు మొత్తంగా ఆయనే బాధ్యుడు. పాత్రికేయులు వెంకట్రావు తన తాజా పుస్తకంలో ఏడు దశాబ్దాల క్రితం జరిగిన తెలుగు రాష్ట్రాల విలీనాన్నీ, దశాబ్దం నాటి విభజననూ నేపథ్యంగా తీసుకుని ఆధునిక తెలుగు జాతి చరిత్రకు అక్షరరూపం ఇచ్చారు. హైదరాబాద్ తొలి-చివరి ముఖ్యమంత్రి బూర్గుల రామకృష్ణారావు, ఆంధ్రరాష్ట్ర తొలి ముఖ్యమంత్రి టంగుటూరి ప్రకాశం పంతులు, ఆంధ్రప్రదేశ్ తొలి ముఖ్యమంత్రి నీలం సంజీవరెడ్డి... ఈ ముగ్గురి వ్యక్తిత్వ చిత్రణతో ఆరంభించి ప్రస్తుత తెలుగు రాష్ట్రాల సీఎంలు నారా చంద్రబాబు నాయుడు, అనుముల రేవంత్‌రెడ్డిల వరకూ... పాలకులను కేంద్రంగా చేసుకుని తెలుగు రాష్ట్రాల రాజకీయ, సామాజిక, ఆర్థిక పరిణామాల్ని బేరీజు వేశారు. రచయితకు ఆయా ముఖ్యమంత్రులతో ఉన్న వృత్తిగతమైన సామీప్యం... పుస్తకానికి సమగ్రతను తెచ్చిపెట్టింది.



విలీనం-విభజన ... గతం-స్వగతం
మన ముఖ్యమంత్రులు
రచన: ఇనగంటి వెంకట్రావు
పేజీలు: 406, వెల: రూ.360
ప్రతులకు: ఫోన్: 9000413413


భానుమతి భారతం



మహాభారతంలో సుయోధనుడు తిరుగులేని ప్రతినాయకుడు. అతని ఇల్లాలు భానుమతి పాత్ర మాత్రం మూడంటే మూడు సందర్భాల్లోనే తారసపడుతుంది. ఇష్టంలేని మనువూ, కష్టం కలిగించే పరిస్థితులూ, దుష్టులైన బంధుగణం... మొత్తంగా కురువంశంలో నెలకొన్న సంక్షోభం ఆమెను తీవ్రంగా కలవరపరుస్తుంది. తనను దుర్యోధనుడు రాక్షసం వివాహం చేసుకోవడాన్ని ఆ ఆత్మాభిమాని జీర్ణించుకోలేక పోతుంది. అంబ జీవితాన్నీ, అత్త గంధారి అశక్తతనూ, పాంచాలి పరిస్థితినీ విశ్లేషించుకునే తీరు భానుమతి ఆలోచనా పరిణతిని చాటుతుంది. మొత్తంగా, ఓ అంతఃపుర మహిళ కోణంలో మహాభారతాన్ని తిరగరాశారు ‘భానుమతి’ నవలా రచయిత రూప్‌కుమార్.

భానుమతి (నవల)
రచన: డా.రూప్‌కుమార్ డబ్బీకార్
పేజీలు: 167, వెల: రూ.200
ప్రతులకు: ప్రధాన పుస్తక కేంద్రాలు

ఉద్వేగాలే ఇతివృత్తాలు



కొట్టం రామకృష్ణారెడ్డి ‘చీకటి యుద్ధం’ సంకలనంలోని పదిహేను కథలూ జీవితంలోని ఉద్వేగాల్ని అక్షరాలుగా మలిచిన రచనలే. ‘విస్ఫర్’ ఒంటరిగా మిగిలిన తండ్రీకూతుళ్ల కొత్త బంగారులోకాన్ని పాఠకుడి ముందు ఆవిష్కరిస్తుంది. తాగుడుకు బానిసై‘పోయిన’ వ్యక్తి... తన భార్యకు మారుమనువు చేయాలనుకునే ప్రయత్నం ఏ దరికి చేరిందో చెప్పే కథ ‘దిద్దుబాటు’. ‘చెల్లని మొహాలు’ బతకనేర్చినతనం పైన అధివాస్తవిక విమర్శ. ‘చీకటి యుద్ధం’ విభిన్న ప్రాంతాలకు చెందిన భార్యాభర్తల సరాగ మాలిక. ‘మనిషికి ఏదో ఓ వ్యసనం ఉండాలి. అదే బతుకు పట్ల ఆశను పుట్టిస్తుంది’ అని వాదిస్తుంది ‘నైజం’.

చీకటి యుద్ధం (మరికొన్ని కథలు)
రచన: కొట్టం రామకృష్ణారెడ్డి
పేజీలు: 152 వెల: రూ.225
ప్రతులకు: ప్రధాన పుస్తక కేంద్రాలు.

బుక్‌షెల్ఫ్

సినీ మాన్యులు-3
రచన: ఎమ్బీయస్ ప్రసాద్
పేజీలు: 247: వెల: రూ.150
ప్రతులకు: ఫోన్: 9000413413

దాశరథి కవిత
సంపాదకులు: టి. ఉడయవర్లు
పేజీలు: 204: వెల: రూ.250
ప్రతులకు: ఫోన్: 9885686415

అద్దంలో నేను (కథా మాలిక); పేజీలు: 243: వెల: రూ.250
నామని వ్యాసావళి; పేజీలు: 195: వెల: రూ.175
మిసెస్ ఫలానా (కవిత్వం); పేజీలు: 124: వెల: రూ.125
ఐ లవ్ మై ఇండియా; పేజీలు: 175: వెల: రూ.175
రచన: నామని సుజనాదేవి; ప్రతులకు: ప్రధాన పుస్తక కేంద్రాలు

కుంకుమ వనం; పేజీలు: 199: వెల: రూ.200

సర్దార్ నాగప్ప (ఓ స్వాతంత్ర్య యోధుని జీవిత గాథ)
పేజీలు: 107: వెల: రూ.150; రచన: యస్.డి.వి. అజీజ్
ప్రతులకు: ఫోన్: 8106367175

రూపురేఖలు (సాహిత్య వ్యాసాలు); రచన: లేదాళ్ళ జయ
పేజీలు: 104: వెల: రూ.100; ప్రతులకు: ఫోన్: 9848787284

రైతన్నకు వెన్నుదన్ను
(కలం-గళం-దృశ్యం)
సేకరణ, రచన, సంకలనం: వలేటి గోపీచంద్
పేజీలు: 184: వెల: రూ.250
ప్రతులకు: ఫోన్:9441276770

బెహరా రామకృష్ణకవి విరచిత నల చరిత్ర (మహా ప్రబంధం)
ముద్రాపకులు: గార రంగనాథం
పేజీలు: 316: వెల: రూ.300
ప్రతులకు: ఫోన్: 9885758123

రాశి ఫలం

గ్రహబలం
(డిసెంబరు 21 - 27)



డా॥ శంకరమంచి రామకృష్ణ శాస్త్రి

మేషం
అశ్వని, భరణి, కృత్తిక 1వ పాదం

భాగ్య శుక్రయోగం ఐశ్వర్యాల్ని ప్రసాదిస్తుంది. కష్టానికి తగిన ఫలితాలు ఉంటాయి. చెడు తలపులు రానివ్వకండి. మనోధైర్యం అవసరం. ఇతరుల ప్రభావానికి గురికాకండి. వ్యాపార సమస్యల్ని సమర్థంగా అడ్డుకుంటారు. ఉద్యోగ వ్యవహారాల్లో మొహమాటం వద్దు. మానసిక ప్రశాంతతను పెంచుకోండి. ఈశ్వరుడిని ఆరాధించండి.

వృషభం
కృత్తిక 2,3,4 పాదాలు; రోహిణి, మృగశిర 1,2 పాదాలు

అదృష్టయోగం ఉంది. ప్రయత్నాలు ఫలిస్తాయి. ఆలోచించి నిర్ణయాలు తీసుకోండి. దైవబలం నడిపిస్తుంది. ఆలోచనల్ని పక్కదారి పట్టించేవారికి దూరంగా ఉండండి. ఉద్యోగులు శుభ వార్తలు వింటారు. ఆర్థికంగా మేలు జరుగుతుంది. వ్యాపారంలో ముందు జాగ్రత్త అవసరం. మారుతిని స్మరించండి.

మిథునం
మృగశిర 3, 4 పాదాలు, ఆర్ద్ర, పునర్వసు 1, 2, 3 పాదాలు

వ్యాపారం విస్తరిస్తుంది. అనుకున్నది సాధిస్తారు. మీదైన రంగంలో గుర్తింపు లభిస్తుంది. లౌక్యంతో వృత్తి ఉద్యోగాల్లోని సమస్యల్ని తప్పించుకుంటారు. సమాజానికి ఉపయోగపడే పనులు చేస్తారు. ఒత్తిడికి దూరంగా ఉండండి. నిర్ణయాల్లో కుటుంబ సహకారం తీసుకోండి. ఆర్థిక వ్యవహారాల్లో దూకుడు వద్దు. ఆధ్యాత్మికతకు ప్రాధాన్యం ఇవ్వండి. సూర్య అష్టోత్తరం చదువుకోండి.

కర్కాటకం
పునర్వసు 4వ పాదం; పుష్యమి, ఆశ్లేష

అంతిమ విజయం మీదే. నిర్ణయాలు సత్ఫలితాలను ఇస్తాయి. మనోబలం లక్ష్యం వైపు నడిపిస్తుంది. పనుల్ని వాయిదా వేయకండి. వృత్తి ఉద్యోగాల్లో గుర్తింపు లభిస్తుంది. ప్రణాళికతో ఒత్తిడిని తగ్గించుకుంటారు. వ్యాపారంలో కలిసొస్తుంది. ఆర్థిక నిర్ణయాల్లో తొందర పాటు వద్దు. ఓ శుభవార్త వింటారు. విష్ణు సహస్రనామాల్ని పఠించండి.

సింహం
మఖ, పుబ్బ, ఉత్తర 1వ పాదం

వ్యాపారం లాభదాయకం. పరిస్థితుల్ని బట్టి నిర్ణయాలు తీసుకోండి. స్వల్ప ప్రయత్నంతోనే మంచి ఫలితాలను సాధిస్తారు. సృజనాత్మకతతో సమస్యల నుంచి బయటపడతారు. ఉద్యోగులకు మేలు జరుగుతుంది. ఇతరుల విషయాల్లో జోక్యం వద్దు. వివాదాలకు దూరంగా ఉండండి. దుర్గమ్మను స్మరించండి.

కన్య
ఉత్తర 2, 3, 4 పాదాలు; హస్త, చిత్త 1, 2 పాదాలు

కష్టానికి తగిన ఫలితాలు అందుతాయి. ఆస్తులు వృద్ధి చెందుతాయి. భూ, గృహ యోగాలు ఉన్నాయి. అభీష్టసిద్ధి ఉంది. ఆత్మబలంతో ఆటంకాలను అధిగమిస్తారు. మంచిచెడుల బేరీజు తర్వాతే ముఖ్య నిర్ణయాలు తీసుకోండి. ప్రశాంతంగా సంభాషించండి. వివాదాలకు ఆస్కారం ఇవ్వకండి. నవగ్రహ శ్లోకాలను పఠించండి.

తుల
చిత్త 3, 4 పాదాలు, స్వాతి, విశాఖ 1, 2, 3 పాదాలు

ఉత్తమకాలం కొనసాగుతోంది. అన్నింటా మేలు జరుగుతుంది. అందివచ్చిన అవకాశాల్ని సద్వినియోగం చేసుకోండి. గతంతో పోలిస్తే మెరుగైన ఫలితాలు ఉంటాయి. భూ, గృహ, వాహనాది యోగాలు ఉన్నాయి. ఆదాయ వనరుల్ని పెంచుకుంటారు. ఉద్యోగంలో ఉన్నత స్థితికి చేరుకుంటారు. వ్యాపారం లాభదాయకం. మహాలక్ష్మిని ధ్యానించండి.

వృశ్చికం
విశాఖ 4వ పాదం; అనూరాధ, జ్యేష్ఠ

ధనయోగం ఉంది. ఆలోచించి నిర్ణయాలు తీసుకోండి. స్థిరాస్తుల విలువ పెరుగుతుంది. ధనరాశిలో ఉన్న శుక్రయోగం ఎంతో మేలు చేస్తుంది. త్రికరణశుద్ధిగా బాధ్యతల్ని నిర్వర్తించండి. అనుమానాస్పద వ్యక్తుల్ని దూరంగా ఉంచండి. దైవబలం కాపాడుతుంది. ప్రయాణాల్లో జాగ్రత్త. ఏ విషయంలోనూ దూకుడు వద్దు. శివుడిని పూజించండి.

ధనుస్సు
మూల, పూర్వాషాఢ, ఉత్తరాషాఢ 1వ పాదం

అదృష్టయోగం ఉంది. ప్రయత్నానికి తగిన ఫలితాలు ఉంటాయి. జన్మ శుక్రయోగం ప్రభావంతో అత్యుత్తమ ఆర్థిక నిర్ణయాలు తీసుకుంటారు. బాధ్యతల నిర్వహణలో కొన్ని ఆటంకాలు ఉన్నా, సమయస్ఫూర్తితో బయటపడతారు. వ్యాపారానికి అవసరమైన ఆర్థిక వనరులు సమకూరతాయి. లక్ష్మీదేవిని పూజించండి.

మకరం
ఉత్తరాషాఢ 2, 3, 4 పాదాలు; శ్రవణం, ధనిష్ఠ 1, 2 పాదాలు

ఆర్థిక స్థిరత్వానికి అనువైన సమయం. అభీష్టసిద్ధి కలుగుతుంది. వ్యాపార విస్తరణకు ప్రయత్నిస్తారు. శుభ ఫలితాలను అందుకుంటారు. భవిష్యత్తు బావుంటుంది. మిత్రుల మద్దతు లభిస్తుంది. కుటుంబ సభ్యుల సహకారం తీసుకోండి. శుభవార్తలు వింటారు. శత్రు పీడ తొలగిపోతుంది. సుబ్రహ్మణ్యేశ్వర స్వామిని స్మరించండి.

కుంభం
ధనిష్ఠ 3, 4 పాదాలు; శతభిషం, పూర్వాభాద్ర 1, 2, 3 పాదాలు

అదృష్టయోగం ఉంది. విజయాలు గోచరిస్తున్నాయి. గతంతో పోలిస్తే మేలైన సమయం. ఆత్మవిశ్వాసాన్ని పెంచుకోవాలి. ఆలోచనలు కార్యరూపం దరిస్తాయి. వ్యాపార విజయాలను అందుకుంటారు. సాహసోపేతమైన నిర్ణయాలు అవసరం అవుతాయి. ఆర్థికంగా బలపడతారు. కుటుంబంతో ఆనందంగా గడుపుతారు. మహాలక్ష్మిని పూజించండి.

మీనం
పూర్వాభాద్ర 4వ పాదం, ఉత్తరాభాద్ర, రేవతి

విజయాలు వరిస్తాయి. ఉద్యోగంలో పేరు తెచ్చుకుంటారు. గతంతో పోలిస్తే మేలైన ఫలితాలు సాధిస్తారు. నలుగురికీ ఆదర్శంగా నిలుస్తారు. వ్యాపారంలో తగిన జాగ్రత్తలు అవసరం. ఆత్మీయులతో విభేదాలు వద్దు. వారం మధ్యలో కొన్ని అవరోధాలు ఉన్నా, సమయస్ఫూర్తితో స్పందిస్తారు. ప్రతి అడుగూ జాగ్రత్తగా వేయండి. విష్ణు సహస్రనామాల్ని పఠించండి.

పదకేళి

కూర్పు: బాలు

1		2	✱	3		4	✱	5		✱	6
	✱	7			✱	8	9		✱	10	
11	12		✱	13	14	✱		✱	15		✱
16		✱	17				✱	18		✱	19
	✱	20		✱		✱	21		✱	22	
✱	23	✱	24		✱	25		✱	26		
27		28		✱	29		✱	30		✱	
✱	31		✱	32			33	✱	34	35	✱
36		✱	37		✱	38			✱	39	
	✱	40			41	✱		✱	42		✱
✱	43			✱	44		✱	45		✱	46
47		✱	48			✱	49		✱	50	

ఆధారాలు- అడ్డం

1. బ్రహ్మ (3)
3. పుత్రుడు (3)
5. ఒక వర్ణం, ఒక రత్నం (2)
7. నిద్ర (3)
8. వంద కన్నులు కలది (3)
10. దుకాణం (2)
11. నవీనత, నూతనత్వం (3)
13. పురుషుడు పౌరుషంగా మెలి తిప్పేది? (2)
15. వెన్నపూసలో సగం (2)
16. విజ్ఞానం, సామెత (2)
17. సఖ్యంగా ఉండటం, పొత్తు, బంధం (4)
18. తప్పు, తరక, పొల్లు (2)
20. ప్రజలు (2)
21. ఆలయం (2)
22. ఉపకారం (2)
24. పాన్పు (2)
25. పశువులు మేసే పచ్చిక, గాదం (2)
26. గజం (3)
27. ఒయ్యారం, వగలు, హొయలు (4)
29. తుదిలేని రజతం (2)
30. కరుణ (2)
31. సుగ్రీవుడి సోదరుడు (2)
32. యాగకర్త, సోమయాగం చేసినవాడు (4)
34. సిరా పోసి కాగితం మీద దేనితో రాస్తాం? (2)
36. మనస్సు (2)
37. హృదయం (2)
38. 'చాలా తేలిక' అనే అర్థంలో '.... మీద నడక' అనే సామెతను వాడతారు (3)
39. సమాధి (2)
40. అల్లుడు అత్తగారింట్లో ఎప్పటికీ ఉండిపోవడం (4)
42. గొప్పవాడు, శ్రేష్ఠుడు (2)
43. రాయడానికి ఏం కావాలి- '......?' బలపమా? (3)
44. కసి, కోపం (2)
45. కుడ్యం (2)
47. తేరు (2)
48. జ్వరం వల్ల ఉపవాసం (3)
49. కంటకాలు (2)
50. తరువు (2)

ఆధారాలు- నిలువు

1. కీచకుడు హతమారిన చోటు (5)
2. మహిళ (3)
3. రుచికరమైన ఒక రకం చేప (4)
4. దర్భ (2)
5. పిట్ట (2)
6. ఆన (2)
9. పరిమళం (2)
10. పురికొస; చివర (2)
12. వలువ (2)
14. బాంధవ్యం, నెయ్యం (3)
15. విరులు (2)
17. తరువాత, పిమ్మట (4)
18. తాటిచెట్టు (2)
19. కాటికి మోసుకెళ్లేందుకు కావలసిన వారెందరు? (4)
21. అంధత్వం (2)
22. శరీరం (2)
23. లాయరు, ప్లీడరు (4)
25. 'ఏనుగు వంటి నడక కలిగినది' అని అర్థం (4)
26. ప్రభువు, పాలించేవాడు (3)
28. వాయువు (2)
29. లక్ష్మి (2)
32. తోబుట్టువు (3)
33. గిల్లితే పాలు కారే మందు మొక్క (3)
35. గోచి (3)
36. మరక (2)
37. కలకాలం (4)
40. పుడమి, భూమి (2)
41. ఒక హస్తాభరణం, మురుగు (3)
42. సౌధం (2)
43. దారి, మార్గం (2)
45. నఖాలు (2)
46. ఒడ్డు, తీరం (2)

సుడోకు

		1	7			2	8	
			5		6			9
	6	9				3		1
9				5				8
			9	4	8			
6				7				3
8		2				5	9	
4			1		5			
	9	5			7	1		

గతవారం సమాధానాలు


పదకేళి

1 స	2 హ	నం	✱	3 శి	4 శి	రం	✱	5 ర	6 హ	స్యం
✱	రి	✱	7 గ	✱	క్ష	✱	8 పు	✱	ద్దు	✱
9 త	✱	10 వి	వా	హం	✱	11 ఆ	కా	శం	✱	12 చ
13 ని	ప్పు	✱	క్షం	✱	14 రా	✱	రు	✱	15 ఉ	ప్పు
వి	✱	16 అ	✱	17 పా	వ	నం	✱	18 ప	✱	డు
✱	19 అ	వ	20 ని	✱	జా	✱	21 క	డ	22 వ	✱
✱	23 స	మా	జం	✱	సు	✱	24 వి	మ	ల	✱
25 గ	✱	నం	✱	26 బె	రు	కు	✱	ర	✱	27 సా
28 ర	వి	✱	29 శి	✱	డు	✱	30 కై	✱	31 భు	వి
శం	✱	32 స	రో	జం	✱	33 ల	లా	టం	✱	త్రి
✱	34 చీ	✱	జం	✱	35 పూ	✱	సం	✱	36 దా	✱
37 కా	ర	ణం	✱	38 వ	లు	వ	✱	39 మ	ర	ణం

సుడోకు

2	5	8	3	9	7	6	4	1
9	1	7	4	8	6	5	3	2
3	4	6	1	5	2	9	7	8
8	6	2	5	7	9	3	1	4
1	7	3	6	4	8	2	5	9
5	9	4	2	1	3	8	6	7
6	8	9	7	3	4	1	2	5
7	3	5	9	2	1	4	8	6
4	2	1	8	6	5	7	9	3

A B C D E F 1 2 3














దేవిరమ్మ గుడి...
ఓ సాహస తీర్థయాత్ర!



అమ్మలగన్న అమ్మ ఆ దుర్గమ్మ తల్లి దర్శనభాగ్యానికి నోచుకోవాలంటే ఏడాదంతా ఎదురు చూడాలి. దట్టమైన చెట్ల నడుమ, జర్రున జారే దారుల్లో నడుస్తూ కొండ శిఖరాన ఉన్న ఆ దేవాలయానికి చేరుకోవాలి. దాదాపు మూడు వేల అడుగుల ఎత్తులో కొలువుదీరిన ఆ గుడికి వెళ్లడానికి ఇంచుమించు 15 కిలోమీటర్ల దూరం నడవాలి. ఎంతో కష్టంతో కూడుకున్న ఈ సాహస తీర్థయాత్ర జరిగేది మరెక్కడో కాదు... కర్ణాటకలోని చిక్కమగళూరుకు దగ్గర్లో ఉన్న దేవిరమ్మ కొండపైన. పశ్చిమ కనుమల్లో వెలసిన ఈ ఆలయంలో ఏటా నరకచతుర్దశి రోజున పెద్ద జాతర జరుగుతుంది. ఆ సమయంలో ఎక్కడెక్కడి నుంచో జనాలు మనసు నిండా భక్తితో, ఎంతో శక్తినీ కూడగట్టుకుని తరలివస్తుంటారు. ఆ ఒక్కరోజు మినహా మిగిలిన సమయంలో కొండ అడుగున ఉన్న దేవిరమ్మ గుడిలోని అమ్మవారిని పూజిస్తుంటారు. ట్రెక్కింగ్ కోసం సాహసికులూ ఈ ఆలయాన్ని చుట్టివస్తుంటారు!



ఆకాశమంత ప్రేమను చూపడానికి తాహతును బట్టి కొందరు బంగారు నెక్లెస్‌ను కొనిపెడితే, మరికొందరు వజ్రాల హారాన్ని బహుమతిగా ఇస్తుంటారు. కానీ చైనాలోని నాన్జింగ్‌కి చెందిన ఒక వ్యక్తి మాత్రం- పెద్ద పర్వతంపైన పచ్చటి చెట్ల మధ్య అందమైన నెక్లెస్‌ను ముచ్చటగా పరిచేశాడు.
అదే పసిడి వర్ణంతో మెరిసిపోతున్న ఈ వృక్షాల హారం. 1930ల్లో చియాంగ్ కై షెక్ అనే ప్రభుత్వ అధికారి తన భార్య కోసం ఇక్కడి కొండ మీద ఓ ప్యాలెస్‌ను కట్టించి, దాని చుట్టూ చక్కటి పెండెంట్‌తో కనిపించే నెక్లెస్ ఆకృతిలో మొక్కల్ని నాటించాడు.
ఆ అందాల హారం- రుతువును బట్టి రంగులు మారుతూ సందర్శకుల్ని పరవశింపచేస్తుందట!